# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 47 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 05-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

నేడే ఉపాధ్యాయ దినోత్సవం.. తల్లిదండ్రుల తర్వాత పిల్లల జీవితాన్ని మలిచే శక్తి గురువుదే..అక్షరాలు నేర్పడమే కాదు.. జీవితాన్ని ఎలా నడపాలో బోధించేది ఉపాధ్యాయుడే..భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత గురువుల భుజాలపైనే ఉంది..కానీ నేటి సమాజంలో గురువుకు ఆ స్థాయి గౌరవం దక్కుతోందా..ఒకప్పుడు గురువు మాట వేదవాక్కు.. ఇప్పుడు మొబైల్‌లోని రీల్ మాటే ఆసక్తికరంగా మారిందా..పుస్తకాలు పక్కనపెట్టి రీల్స్ మోజులో మునిగిపోతున్న విద్యార్థుల భవిష్యత్తు ఎటు..తప్పును సరిదిద్దాలన్నా.. విద్యార్థిని మందలించాలన్నా ఉపాధ్యాయుడు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి ఎందుకు..పాఠశాలలో గురువు నిర్భయంగా బోధించే వాతావరణం ఉందా..గురువును ప్రశ్నించడం తప్పు కాదు.. కానీ అవమానించడం మాత్రం విద్యా వ్యవస్థకే నష్టం..మార్కులు, ర్యాంకులతో పాటు విలువలు నేర్పే గురువుల అవసరం నేడు మరింత పెరిగింది..తల్లిదండ్రుల శ్రద్ధకు.. ఉపాధ్యాయుల మార్గనిర్దేశం తోడైతేనే పిల్లల భవిష్యత్తు బంగారుమయం..గురువు ఉద్యోగి కాదు.. సమాజ నిర్మాత.. ఆయన చేతిలోని చాక్ రేపటి తరానికి భవిష్యత్ రేఖ గీస్తుంది..ఒక్కరోజు పూలమాల వేసి సన్మానించడం కాదు.. ప్రతిరోజూ గురువు మాటకు విలువ ఇవ్వాలి..గురువు గౌరవం తగ్గితే విద్య విలువ తగ్గుతుంది.. విద్య విలువ తగ్గితే సమాజం దిశ తప్పుతుంది..గురువును గౌరవిద్దాం.. విద్యను కాపాడుదాం.. భావి భారతాన్ని తీర్చిదిద్దుదాం..- - -


నడ్డి శివకృష్ణ యాదవ్. ....
ప్రజా వాయిస్.
ఉమ్మడి నల్గొండ బ్యూరో చీఫ్.


# కేబినెట్ విస్తరణకు కసరత్తు..
# ఎవరికి ఛాన్స్?





- కొండా సురేఖ బర్తరఫ్‌తో మంత్రివర్గంలో మూడు ఖాళీలు
- అసెంబ్లీ సమావేశాల తర్వాత విస్తరణపై సీఎం రేవంత్ నిర్ణయం
- బీసీ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పేర్లు
- విజయశాంతి, సుదర్శన్‌రెడ్డి పేర్లపైనా తీవ్ర చర్చ
- ఎస్టీ కోటాలో బాలు నాయక్, రామచంద్రు నాయక్ రేసులో
- స్పీకర్, మంత్రి పదవుల మధ్య మార్పులు చేపట్టేలా షఫ్లింగ్‌పై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ







## కొండా సురేఖ సంచలన పోస్ట్.. 'బిగ్ అప్డేట్'పై ఉత్కంఠ..

- మంత్రి పదవి నుంచి తొలగింపు తర్వాత సురేఖ కీలక ఫేస్‌బుక్ పోస్ట్
- 'బిగ్ అప్డేట్ కమింగ్ సూన్' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌లో కొనసాగుతారా? అనే చర్చ
- కేడర్‌తో కొండా కుటుంబం సంప్రదింపులు
- సురేఖ తదుపరి నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ




**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత మాజీ మంత్రి కొండా సురేఖ పెట్టిన తాజా ఫేస్‌బుక్ పోస్ట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ది వెయిట్ ఈజ్ ఆల్మోస్ట్ ఓవర్.. ఏ బిగ్ అప్డేట్ కమింగ్ సూన్.. స్టే ట్యూన్ తెలంగాణ' అంటూ ఆమె చేసిన పోస్టు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**బర్తరఫ్ తర్వాత 'బిగ్ అప్డేట్'..**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన అంశం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధిష్ఠానం బర్తరఫ్‌కు ఆమోదం తెలిపిన అనంతరం.. సీఎం రేవంత్‌రెడ్డి సిఫారసు లేఖను గవర్నర్‌కు పంపించారు. అనంతరం కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ గవర్నర్ పేరుతో

మిగతా 2లో

## ఘట్‌కేసర్ సమీపంలో మహిళ మృతదేహం.. కలకలం

- యమ్నంపేటలో చెట్ల పొదల్లో మహిళ మృతదేహం లభ్యం
- కుళ్లిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు
- వారం రోజుల క్రితమే మృతి చెంది ఉండొచ్చని అనుమానం
- హత్య జరిగిందా? ఇతర కారణమా? అనే కోణంలో దర్యాప్తు
- పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల కోసం ఎదురుచూపు

2 లో



## కొండా సురేఖ బర్తరఫ్‌పై మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

- సురేఖ బర్తరఫ్ బాధాకరం: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందన్న మహేశ్ గౌడ్
- క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే సురేఖపై చర్యలు
- పార్టీ లైన్ దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టం
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదన్న మహేశ్ గౌడ్



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించిన వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ బర్తరఫ్ కావడం బాధాకరమని ఆయన అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన మహేశ్ గౌడ్.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**సుస్మిత వ్యాఖ్యలను ఖండించాల్సింది..**

కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని మహేశ్ గౌడ్ అభిప్రాయపడ్డారు. అయితే సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. సురేఖ తన మాటతీరును మార్చుకోవాలని హితవు పలికారు.

**క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే బర్తరఫ్..**

కొండా సురేఖపై తీసుకున్న చర్యలు క్రమశిక్షణ చర్యల్లో భాగమేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే

మిగతా 2లో

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానివ్వం: జగదీశ్‌రెడ్డి

2 లో

- తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమని హెచ్చరిక
- రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా పార్టీలోకి తీసుకోబోమని స్పష్టం
- ఎన్నికల ముందే కోమటిరెడ్డి బ్రదర్స్‌ను పార్టీలోకి తీసుకోలేదన్న జగదీశ్‌రెడ్డి
- రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయిన ట్లేనని విమర్శ



## మాదాపూర్‌లో నిషేధిత ఈ-సిగరెట్ల దందా .. ఈగల్ ఫోర్స్ దాడులు

- రెండు ఔట్‌లెట్లపై ఆకస్మిక దాడులు.. 152 నిషేధిత ఈ-సిగరెట్లు స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్.. ఇద్దరు యజమానులు పరారీ
- 34 ఫారిన్ సిగరెట్ ప్యాకెట్లు, 3 స్కానర్లు, రూ.9,500 నగదు సీజ్
- రెండు బ్యాంకు ఖాతాల్లో రూ.2.31 కోట్లకు పైగా లావాదేవీలు
- వెబ్‌సైట్, వాట్సప్ ద్వారా ఆర్డర్లు.. పోర్టర్, రాపిడో ద్వారా డెలివరీ



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** నగరంలోని మాదాపూర్‌లో జోరుగా సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల దందాపై ఈగల్ ఫోర్స్ పంజా విసిరింది. నిషేధిత ఈ-సిగరెట్ల విక్రయాలపై సమాచారం అందడంతో మాదాపూర్‌లోని రెండు ఔట్‌లెట్లపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 152 నిషేధిత ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేయగా.. ఇద్దరు యజమానులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**వెబ్‌సైట్, వాట్సప్ ద్వారా దందా..**

నిందితులు నిషేధిత ఈ-సిగరెట్ల విక్రయాలను వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని పోర్టర్, రాపిడో వంటి డెలివరీ సేవల ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. చెల్లింపులను క్యూఆర్ కోడ్‌ల ద్వారా స్వీకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

మిగతా 2లో

## సీఎం కావాలనుకుంటున్నా.. కవిత కీలక వ్యాఖ్యలు

- తాను సీఎం కావాలని అనుకుంటున్నట్లు స్పష్టం చేసిన కవిత
- ముఖ్యమంత్రి పదవికి గౌరవం, హుందాతనం ఎంతో ముఖ్యమని వ్యాఖ్య
- రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు
- హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేయాలని సవాల్
- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధమని వెల్లడి

2 లో

## జేఎన్టీయూలో విద్యార్థుల ఘర్షణ.. రణరంగంగా క్యాంపస్..

- తీజ్ వేడుకల్లో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి
- గౌతమి, మంజీరా హాస్టళ్ల విద్యార్థుల పరస్పర దాడులు
- కర్రలతో దాడులు.. పలువురు విద్యార్థులకు గాయాలు
- రంగంలోకి దిగిన కేపీహెచ్‌బీ పోలీసులు
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు

2లో

# కేబినెట్ విస్తరణకు కసరత్తు.. ఎవరికి ఛాన్స్?

**ప్రజావాయిస్, పొలిటికల్ బ్యూరో:** తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో కేబినెట్ విస్తరణపై ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఇన్నాళ్లు రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా.. సురేఖను తప్పించడంతో ఖాళీల సంఖ్య మూడుకు చేరింది. దీంతో ఈ మూడు స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారు? ఎవరికి అవకాశం దక్కుతుంది? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

**అసెంబ్లీ సమావేశాల తర్వాతే విస్తరణ?**

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో అధిష్ఠానం నుంచి ఇప్పటికే అనుమతి లభించినట్లు సమాచారం. ఇక ముహూర్తం ఖరారు చేయాల్సింది ముఖ్యమంత్రి మాత్రమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొండా సురేఖ బీసీ సామాజికవర్గానికి చెందిన మంత్రి కావడంతో.. ఆమె స్థానంలో అదే సామాజికవర్గానికి చెందిన నేతకు అవకాశం కల్పించడం దాదాపు ఖాయమనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు ముందువరుసలో ఉండగా.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**విజయశాంతికి అవకాశం?**

కేబినెట్‌లో మహిళా ప్రాతినిధ్యాన్ని కొనసాగించేందుకు ముగ్గురు మహిళా నేతలకు అవకాశం కల్పించే అంశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఆమెను మంత్రివర్గంలోకి తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వం ప్రతిపాదిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**రెడ్డి కోటాలో సుదర్శన్‌రెడ్డి?**

మరో మంత్రి పదవిని రెడ్డి సామాజికవర్గానికి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కోటాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రస్తుతం కేబినెట్‌లో మంత్రి లేకపోవడంతో.. ప్రాంతీయ సమతుల్యత దృష్ట్యా సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఇదే సమయంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు కూడా మంత్రి పదవి కోసం వినిపిస్తోంది. అయితే ఆయన ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ నాయకత్వంపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనను కేబినెట్‌లోకి తీసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ కూడా జరుగుతోంది. కోమటిరెడ్డి కుటుంబంలో ఇప్పటికే ఒకరికి మంత్రి పదవి ఉండటంతో మరో అవకాశం ఇవ్వడంపైనా అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

**స్పీకర్—మంత్రి మార్పుపై మరో కీలక చర్చ..**

కాంగ్రెస్ పార్టీలో మరో ఆసక్తికరమైన ప్రతిపాదనపై అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం మంత్రి పదవిలో ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌ను స్పీకర్‌గా నియమించి, ప్రస్తుత శాసనసభ స్పీకర్‌గా ఉన్న గడ్డం ప్రసాద్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ఈ మేరకు స్పీకర్, మంత్రి పదవుల మధ్య మార్పులు చేపట్టేలా షఫ్లింగ్‌పై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**ఎస్టీ కోటాలో ఎవరికి?**

మరో మంత్రి పదవిని ఎస్టీ సామాజికవర్గంలోని లంబాడా వర్గానికి ఇవ్వాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కోటాలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పేరు ముందుకు వస్తోంది. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన మంత్రులు ఉండటంతో.. రాజగోపాల్‌రెడ్డికి, బాలు నాయక్‌కు ఇద్దరికీ అవకాశం ఇస్తే ప్రాంతీయ సమీకరణాలు ఎలా ఉంటాయనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

మరోవైపు బాలు నాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించే ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించిన నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన లంబాడా నేతకు అవకాశం ఇవ్వాలనే సమీకరణంలో రామచంద్రు నాయక్ పేరు కూడా వినిపిస్తోంది. డిప్యూటీ స్పీకర్ పదవిని తీసుకోకపోవడంపై ఆయనపై అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మొత్తంగా మూడు ఖాళీ స్థానాలకు బీసీ, రెడ్డి, ఎస్టీ సామాజిక సమీకరణాలతో పాటు ప్రాంతీయ సమతుల్యతను పరిగణనలోకి తీసుకుని నేతలను ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి మనసులో ఎవరున్నారనేది మాత్రం తుది నిర్ణయం వెలువడిన తర్వాతే స్పష్టమవుతుంది. గాంధీభవన్ వర్గాల్లో జరుగుతున్న చర్చల నేపథ్యంలో త్వరలోనే కేబినెట్ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## జేఎన్టీయూలో విద్యార్థుల ఘర్షణ.. రణరంగంగా క్యాంపస్..



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ క్యాంపస్‌లో విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకోవడం కలకలం రేపింది. గురువారం రాత్రి తీజ్ వేడుకల సందర్భంగా రెండు వర్గాల మధ్య మొదలైన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. గౌతమి, మంజీరా హాస్టళ్లకు చెందిన విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడులు చేసుకోవడంతో క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**తీజ్ వేడుకల్లో మొదలైన వివాదం..**

హాస్టల్‌లో తీజ్ కార్యక్రమం జరుగుతున్న సమయంలో రెండు వర్గాల మధ్య వివాదం మొదలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఓ విద్యార్థిపై దాడి జరగడంతో పరిస్థితి అదుపుతప్పినట్లు సమాచారం. అనంతరం ఇరువర్గాల విద్యార్థులు కర్రలు తీసుకుని పరస్పరం దాడులు చేసుకున్నారు.

**పలువురికి గాయాలు..**

ఘర్షణలో పలువురు విద్యార్థులు గాయపడగా.. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనతో మిగతా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడికి చేరుకుని విద్యార్థులను నిలువరించే ప్రయత్నం చేశారు.

**రంగంలోకి దిగిన పోలీసులు..**

సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు హుటాహుటిన జేఎన్టీయూ క్యాంపస్‌కు చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, ఇందులో పాల్గొన్న విద్యార్థుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.

**యాజమాన్యం విచారణకు సిద్ధం..**

విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై వర్సిటీ యాజమాన్యం కూడా విచారణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు యూనివర్సిటీ అధికారులను కోరుతున్నారు.

**బంజారాల సంస్కృతిలో తీజ్‌కు ప్రత్యేక స్థానం..**

బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మొలకల పండుగ తీజ్. ప్రకృతి ఆరాధనకు సంబంధించిన ఈ వేడుకల్లో అవివాహిత యువతులు ప్రధాన పాత్ర పోషిస్తారు. ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్ట మట్టితో వస్త్రంలో గోధుమలను విత్తుతారు. తొమ్మిది రోజుల పాటు నీరు పోసి మొలకలు పెంచుతారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్ మహారాజ్, ఇతర దేవతలను ప్రార్థిస్తారు.

## కొండా సురేఖకు వరుస షాక్‌లు.. భద్రత కుదింపు

- మంత్రి పదవి కోల్పోయిన మాజీ మంత్రి కొండా సురేఖ
- సురేఖకు ఉన్న భద్రతను ప్రభుత్వం కుదించినట్లు సమాచారం
- గన్‌మెన్లను వెనక్కి రప్పించిన అధికారులు
- బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సైతం స్వాధీనం
- తాజా పరిణామాలతో సురేఖ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** మాజీ మంత్రి కొండా సురేఖకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సుతో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించారు. దేవాదాయ శాఖ మంత్రి పదవిని కోల్పోయిన నేపథ్యంలో తాజాగా ఆమె భద్రతను కూడా రాష్ట్ర ప్రభుత్వం కుదించినట్లు సమాచారం.

**గన్‌మెన్లను వెనక్కి రప్పింపు..**

మంత్రి హోదాలో కొండా సురేఖకు కల్పించిన భద్రతను అధికారులు తాజాగా తగ్గించారు. ఆమెకు కేటాయించిన గన్‌మెన్లను వెనక్కి రప్పించినట్లు తెలుస్తోంది. అలాగే భద్రత కోసం వినియోగిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**పూర్తిగా తొలగించిన భద్రత..**

మంత్రిగా ఉన్న సమయంలో సురేఖకు ఉన్న 4+4 భద్రతను మొత్తంగా తొలగించినట్లు సమాచారం. మంత్రి పదవి కోల్పోవడంతో భద్రతా ఏర్పాట్లలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజకీయంగా ఇప్పటికే ఎదురుదెబ్బలు తగులుతున్న సురేఖకు తాజాగా భద్రత విషయంలోనూ షాక్ తగిలింది.

**మరింత ఆగ్రహంలో సురేఖ?**

వరుస పరిణామాలతో కొండా సురేఖ మరింత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. మంత్రి పదవి నుంచి తొలగింపు, తాజాగా భద్రత కుదింపు నేపథ్యంలో ఆమె తదుపరి అడుగు ఎలా ఉండబోతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



## కొండా సురేఖ బర్తరఫ్‌పై మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

హైకమాండ్ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.

**పార్టీలో మాట్లాడేందుకు ఎన్నో వేదికలు**

పార్టీలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ఎన్నో వేదికలు ఉన్నాయని మహేశ్ గౌడ్ అన్నారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ వేదికలపై చర్చించుకోవచ్చని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**బీసీలకు భవిష్యత్తులోనూ ప్రాధాన్యం...**

తెలంగాణలో భవిష్యత్తులోనూ బీసీలకు పెద్దపీట వేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. పార్టీ నిర్ణయాలు, క్రమశిక్షణ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.



## కొండా సురేఖ సంచలన పోస్ట్.. 'బిగ్ అప్డేట్'పై ఉత్కంఠ..

మొదటి పేజీ తరువాయి

గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది.

**కాంగ్రెస్‌లో కొనసాగుతారా?..**

బర్తరఫ్ అనంతరం కొండా సురేఖ భవితవ్యంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె.. కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే తాజాగా 'బిగ్ అప్డేట్' అంటూ ఆమె చేసిన పోస్ట్‌తో మరోసారి రాజకీయ చర్చ మొదలైంది. కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? లేక ఏదైనా కీలక నిర్ణయం ప్రకటిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**కేడర్‌తో కొండా కుటుంబం సంప్రదింపులు..**

పార్టీలో కొనసాగడంపై కొండా కుటుంబం కూడా ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం నుంచి కేడర్‌తో కొండా కుటుంబ సభ్యులు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సురేఖ తదుపరి రాజకీయ అడుగు ఎలా ఉండబోతుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

**బిగ్ అప్డేట్' ఏంటన్నదే ఆసక్తి..**

ఫేస్‌బుక్ వేదికగా సురేఖ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. ఇంతకీ ఆమె చెప్పిన బిగ్ అప్డేట్ ఏంటి? అనే చర్చ జరుగుతోంది. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని ఆమె పోస్టు ద్వారా సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో.. సురేఖ తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## మాదాపూర్‌లో నిషేధిత ఈ-సిగరెట్ల దందా .. ఈగల్ ఫోర్స్ దాడులు

**రూ.2.31 కోట్లకు పైగా లావాదేవీలు..**

నిందితులకు చెందిన రెండు బ్యాంకు ఖాతాలను పరిశీలించిన పోలీసులు.. వాటిలో రూ.2.31 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ-సిగరెట్ల నిల్వ, అక్రమ రవాణా, విక్రయాలపై ఈగల్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించింది.

**30 మంది వినియోగదారులు..**
**351 మంది కొనుగోలుదారులు..**

బ్యాంకు లావాదేవీలు, ఇతర వివరాలను పరిశీలించిన పోలీసులు హైదరాబాద్‌లో 130 మంది ఈ-సిగరెట్ల వినియోగదారులు, 351 మంది కొనుగోలుదారులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ-సిగరెట్లను కొనుగోలు చేయడం కూడా చట్టప్రకారం నేరమేనని పోలీసులు స్పష్టం చేశారు. నిషేధిత ఉత్పత్తులను కొనుగోలు చేసిన వారిపైనా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**బ్యాటరీతో పనిచేసే పరికరాలే 'వేప్స్'..**

సాధారణ సిగరెట్లలో నికోటిన్ పొగాకు రూపంలో ఉంటుంది. ఈ-సిగరెట్లలో నికోటిన్, ఇతర రసాయనాల మిశ్రమం ద్రవ రూపంలో ఉంటుంది. బ్యాటరీతో పనిచేసే ఈ పరికరాలు రసాయన ద్రవాన్ని వేడి చేసి ఆవిరిగా మారుస్తాయి. ఆ నికోటిన్ ఆవిరిని వినియోగదారులు పీల్చుతారు. పెన్ను మాదిరిగా కనిపించే వీటిని వేప్స్, వేప్ పెన్నులు అని పిలుస్తారు.

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానివ్వం: జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** మాజీ మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానివ్వబోమని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆమెను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమని హెచ్చరించారు.

**సురేఖకు బీఆర్ఎస్‌లో చోటు లేదు..**

కొండా సురేఖ బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రయత్నించినా అనుమతించబోమని జగదీశ్‌రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌కు ఆమెను రానివ్వబోమంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

**రాజగోపాల్‌రెడ్డిపైనా కీలక వ్యాఖ్యలు..**

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తమ పార్టీలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే కోమటిరెడ్డి బ్రదర్స్ బీఆర్ఎస్‌లోకి వస్తామని చెప్పినా వారిని పార్టీలోకి తీసుకోలేదని గుర్తు చేశారు.

**మంత్రి పదవిపై తీవ్ర విమర్శలు..**

కాంగ్రెస్ హైకమాండ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే.. ఆయన డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తాజాగా కొండా సురేఖ వ్యవహారం నేపథ్యంలో జగదీశ్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఘటకేసర్ సమీపంలో మహిళ మృతదేహం.. కలకలం

**యమ్నంపేట, ప్రజావాయిస్ బ్యూరో:** జిల్లాలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ మృతదేహం కలకలం రేపింది. యమ్నంపేటలోని ఓ యూనివర్సిటీ సమీపంలోని చెట్ల పొదల్లో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. యూనివర్సిటీ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

**కుళ్లిన స్థితిలో మృతదేహం..**

మృతదేహం కుళ్లిన స్థితిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి వయసు సుమారు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. దాదాపు వారం రోజుల క్రితమే ఆమె మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

**ఆధారాల సేకరణ**

ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీమ్ ఆధారాలను సేకరిస్తోంది. మృతదేహం లభించిన ప్రాంతంలో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలన చేపట్టారు. మృతురాలి వివరాలను గుర్తించేందుకు కూడా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

**హత్య జరిగిందా?..**

మహిళ మృతిపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇది హత్యా? లేక ఇతర కారణాలతో ఆమె మృతి చెందిందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఘటనకు సంబంధించి అనుమానాస్పద పరిస్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**నివేదికల తర్వాతే అసలు కారణం..**

మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మరణానికి గల కారణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పోస్టుమార్టం నివేదికతో పాటు ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తును ముమ్మరం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీఎం కావాలనుకుంటున్నా.. కవిత కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో తన రాజకీయ లక్ష్యాలపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని స్పష్టం చేసిన ఆమె.. ముఖ్యమంత్రి పదవి కేవలం అధికార హోదా కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం ఎంతో ముఖ్యమని అన్నారు.

**రేవంత్‌రెడ్డి పాలనపై కవిత సెటైర్లు..**

సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై కవిత విమర్శలు గుప్పించారు. ఇకపై 'తుగ్లక్ చర్యలు' అని చెప్పాల్సిన అవసరం లేదని.. 'రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్' అంటే చాలని వ్యాఖ్యానించారు. సీఎం పనితీరును ఉద్దేశించి ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

**హరీశ్‌రావు భార్యకు సవాల్..**

ఇదే సమయంలో తన రాజకీయ ప్రత్యర్థులపై కూడా కవిత తీవ్రస్థాయిలో స్పందించారు. దమ్ముంటే హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. తనపై ఎవరో ఒకరు పోటీ చేయడం తప్పదని, అవసరమని భావిస్తే హరీశ్‌రావు రాజకీయాలను పక్కనపెట్టి తన భార్యను రాజకీయాల్లోకి తీసుకురావచ్చని అన్నారు.

**ఎవరొచ్చినా ఎదుర్కొంటా..**

తాను గతంలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాట వాస్తవమేనని కవిత గుర్తుచేశారు. అయితే ఇప్పుడు హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని స్పష్టం చేశారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని కవిత తేల్చిచెప్పారు.



# కేబినెట్‌లోకి రాములమ్మ..!

- సురేఖ స్థానంలో విజయశాంతికి బెర్త్
- మహిళా నేతకే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం సూచన
- రాములమ్మతో కాంగ్రెస్ కు మరింత రాజకీయ బలం
- త్వరలోనే మంత్రివర్గ ప్రక్షాళనకు కసరత్తు

**ప్రజా వాయిస్ డెస్క్,హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో కేబినెట్ మార్పులపై ఉత్కంఠ కొనసాగుతోంది. మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించిన నేపథ్యంలో ఆమె స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్న చర్చకు తెరలేచింది. సురేఖ స్థానంలో మహిళా నేతకే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం సూచించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఫైర్‌బ్రాండ్ నేతగా గుర్తింపు ఉన్న రాములమ్మకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి రాజకీయంగా మరింత బలం చేకూరుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.

### రాములమ్మకు బెర్త్ ఖాయమేనా..?

సామాజిక, రాజకీయ సమీకరణాలతో పాటు మహిళా ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విజయశాంతిని కేబినెట్‌లోకి తీసుకునే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

### కేబినెట్ ప్రక్షాళనపై కసరత్తు

సురేఖ ఉద్వాసనతో ఖాళీ అయిన స్థానంతో పాటు ఇప్పటికే ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీపై కూడా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించినట్లు సమాచారం. దీంతో త్వరలోనే మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరందుకుంది.

# పన్నులు వసూలు చేస్తున్నారు.. సౌకర్యాలు పట్టించుకోరా?

- రహదారి పక్కన ఇళ్ల సముదాయాల్లో చెట్లపొదలు
- దోమలు, పాములకు ఆవాసాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు.

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఇళ్ల సముదాయాల్లో చెట్లపొదలు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయి దోమలు, పాములకు ఆవాసాలుగా మారుతున్నాయని, డ్రైనేజీలలో పూడికను శుభ్రం చేయించడం లేదని, దాని వల్ల కాలువలలో నీరు నిల్వ ఉండి దోమల బెడద పెరుగుతోందని,వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల భయంతో ప్రజలు బెంబేలెత్తుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పారిశుధ్య నిర్వహణ, చెట్లపొదల తొలగింపు వంటి కనీస సౌకర్యాలను కల్పించకపోతే ప్రజల నుంచి పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారో అధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు నిలదీస్తున్నారు. పొదల్లో పాములు సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లపొదలను తొలగించి, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



# 1000 రోజుల పాలన.. 420 హామీల గతి ఏంటి..?

- మహిళల ఓట్లతో అధికారం.. హామీల అమలులో కాంగ్రెస్ ఘోరం!
- శంకరంపేటలో భూపాల్ రెడ్డి సమరశంఖం.. కాంగ్రెస్ కు బీఆర్ ఎస్ సవాల్ !
- రూ.2,500 హామీ ఏమైంది..?
- స్కూటీలు, తులం బంగారం ఎక్కడ..?



**శంకరంపేట(అ), ప్రజా వాయిస్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా.. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. శంకరంపేట(అ) మండల కేంద్రంలో నిర్వహించిన మహిళా సదస్సులో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఎన్నికల ముందు మహిళల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలును విస్మరిస్తోందని భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మహిళల ఓట్లతో అధికారాన్ని దక్కించుకుని.. అదే మహిళల సమస్యలను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

### రూ.2,500 హామీ ఏమైంది..?

ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని భూపాల్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పిన హామీ ఎక్కడ అమలవుతోందో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కళ్యాణలక్ష్మి.. తులం బంగారం హామీ ఏమైంది?

కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ పరిస్థితి ఏమిటని ఆయన నిలదీశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు అండగా నిలుస్తామని చెప్పిన ప్రభుత్వం.. హామీల అమలులో స్పష్టత ఇవ్వాలని కోరారు.అలాగే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.420 హామీలపై లెక్క చెప్పాలికాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల్లో ఎన్ని అమలు చేశారో.. ఎన్ని అమలు చేయాల్సి ఉందో ప్రజల ముందు ప్రభుత్వం స్పష్టమైన లెక్క చెప్పాలని భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును పట్టించుకోకపోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు."ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవడం రాజకీయ నాయకత్వం కాదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే నిజమైన ప్రజా పాలన" అని భూపాల్‌రెడ్డి అన్నారు.స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నించిన భూపాల్‌రెడ్డినియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని భూపాల్‌రెడ్డి నిలదీశారు. ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తున్నప్పుడు వారి తరఫున అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించి హామీల అమలుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోతే.. మహిళలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.మహిళల భారీ హాజరుశంకరంపేట(అ) మండల కేంద్రంలో నిర్వహించిన మహిళా సదస్సుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, అలుగుల సత్యనారాయణ, భూత్కూరి సుభాష్ చంద్రబోస్, సురేష్ గౌడ్, దత్తు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దమ్ముంటే బహిరంగ చర్చకు రండి

- రాజీవ్ గాంధీ సెంటర్ కు రండి.. లేక నల్గొండ క్లాక్ టవర్ కు రండి
- గణాంకాలు, ఆధారాలతో ప్రజల ముందే చర్చిద్దాం
- మిర్యాలగూడలో 25,703 మంది రైతులకు రూ.197 కోట్ల రుణమాఫీ
- సాగర్ కాలువల ద్వారా 9 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- రేవంత్, ఉత్తమ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్
- కేటీఆర్ కు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సవాల్

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ:** బీఆర్ఎస్ నేతలు కేటీఆర్,హరీష్‌రావులు నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మండిపడ్డారు. మిర్యాలగూడ రాజీవ్ గాంధీ సెంటర్ లేదా నల్గొండ క్లాక్ టవర్ వద్దకు వస్తే బహిరంగ చర్చకు సిద్ధమని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, మిర్యాలగూడ నియోజకవర్గంలో 25,703 మంది రైతులకు రూ.197 కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రూ.2,005 కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. సాగర్ కాలువల ద్వారా 9,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని స్పష్టం చేశారు. రూ.1,000 కోట్లతో రహదారులు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, మరోసారి వ్యక్తిగత విమర్శలకు దిగితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై విమర్శలు చేయడాన్ని కూడా శంకర్ నాయక్ ఖండించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అమలు చేస్తోందని, దమ్ముంటే గణాంకాలు, ఆధారాలతో ప్రజల సమక్షంలో చర్చించాలని సవాల్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.69 కోట్ల రోడ్లకు నేడు శంకుస్థాపన

- వనపర్తికి మంత్రి సీతక్క
- భారీ ర్యాలీకి కాంగ్రెస్ సన్నాహాలు

**ప్రజా వాయిస్,వనపర్తి:** పంచాయతీరాజ్ శాఖ హామ్ ప్రాజెక్ట్ కింద రూ.69 కోట్లతో చేపట్టనున్న రోడ్ల పనులకు సంబంధించిన పైలాన్‌ను మంత్రి సీతక్క శుక్రవారం ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు హాజరుకానున్నారు.కొల్లాపూర్ నుంచి వనపర్తికి రానున్న మంత్రి సీతక్కకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీతో స్వాగతం పలకనున్నాయి. అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్ మీదుగా చిట్యాల రోడ్డులోని పైలాన్ ప్రాంగణానికి చేరుకుని ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌లో మంత్రులు పాల్గొంటారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ నాయకులు కోరారు.



# మాన్యం చెల్క వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు వేగవంతం చేయాలి

- వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని కలిసిన మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అహ్మద్ కలీమ్
- న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని లీగల్ కౌన్సెల్ కు ఛైర్మన్ ఆదేశం



**ప్రజా వాయిస్,హైదరాబాద్:** నల్లగొండ పట్టణంలోని మాన్యం చెల్క ప్రాంతంలో వక్ఫ్ భూములకు సంబంధించిన వివాదంపై చర్యలు వేగవంతం చేయాలని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, సామాజిక కార్యకర్త అహ్మద్ కలీమ్ కోరారు. ఈ మేరకు నాంపల్లిలోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని కలిసి భూముల పరిరక్షణ, గతంలో చేపట్టిన చర్యలు, కొనసాగుతున్న న్యాయపరమైన అంశాలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఛైర్మన్ వెంటనే తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది, వక్ఫ్ బోర్డు లీగల్ కౌన్సెల్ ఫర్హాన్ ఆజమ్ ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. న్యాయపరమైన రికార్డుల ప్రకారం నల్లగొండ పట్టణంలోని సర్వే నంబర్ 35లో ఎకరం 1-22 గుంటల భూమికి సంబంధించిన వివాదం రెవెన్యూ స్థాయి నుంచి స్పెషల్ ట్రిబ్యునల్, అనంతరం హైకోర్టు వరకు వెళ్లింది. ఈ వ్యవహారానికి సంబంధించి F2/231/2019, F2/Spl Tribunal/0253/2021, W.P. No.18633/2021, W.P. No.21210/2021, W.P. No.6840/2021 కేసులు ప్రస్తావనకు వచ్చాయి. గత పదేళ్లకు పైగా వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం తాను పోరాడుతున్నానని, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని అహ్మద్ కలీమ్ తెలిపారు. వక్ఫ్ ఆస్తులను రక్షించడం, రికార్డుల ఆధారంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే తన లక్ష్యమని, ఇకముందు కూడా చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# హామీలన్నీ గాలికే.. ప్రజలకు మిగిలింది భారమే.!

- వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన మాట నెరవేర్చలేదు
- కాంగ్రెస్ పాలనపై బీఆర్ ఎస్ నేత మల్లయ్యయాదవ్ ధ్వజం



**ప్రజా వాయిస్,చిలుకూరు:** ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడుస్తున్నా వాటి అమలులో విఫలమైందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ధ్వజమెత్తారు. ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి హామీలను గాలికొదిలేశారని ఆరోపించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సదస్సు, వంటా,వార్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని మల్లయ్యయాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పింఛన్లు సకాలంలో అందించామని పేర్కొన్న ఆయన.. ప్రస్తుతం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల బెడద పెరిగిందని ఆరోపించారు. నిత్యావసర సరుకులు, మందుల ధరలు పెరగడంతో సామాన్యులపై భారం పడుతోందన్నారు.


### పథకాలపై నిర్లక్ష్యం

కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలను పక్కనపెట్టారని మల్లయ్యయాదవ్ ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం పేరుతో బస్సుల సంఖ్య తగ్గించడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

### ప్రజల పక్షాన పోరాటం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని మల్లయ్యయాదవ్ స్పష్టం చేశారు. పదవిలో ఉన్నా లేకపోయినా బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని తెలిపారు.





## దళిత మహిళా వార్డు సభ్యురాలిపై వేధింపులు

- సర్పంచ్ కక్షసాధింపుల కుట్రలు
- అధికారులకు ఎస్సీ కమిషన్ కు ప్రత్యూష ఫిర్యాదు



**ప్రజా వాయిస్ పాల్వంచ**, సెప్టెంబర్ 4:పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామపంచాయతీకి చెందిన 9వ వార్డు ఎస్సీ మహిళా సభ్యురాలు దేవోల్లా ప్రత్యూష తనపై గ్రామ సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి, ఆయన అనుచరులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ వేధిస్తున్నారనిఅధికారులకు ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు, సంబంధితశాఖల మంత్రులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఎస్సీ మహిళా రిజర్వేషన్ కింద వార్డు సభ్యురాలిగా ఎన్నికైనప్పటి నుంచి సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ కోల బాలగౌడ్, ఉపాధ్యాయుడు కొంగల వెంకటి, 2వ వార్డు సభ్యురాలి భర్త కంఠం సిద్ధారాములు తనపై వ్యక్తిగత కక్షతో వేధింపులకు పాల్పడుతున్నారని ఎస్సీ వార్డు సభ్యురాలు ఆరోపించారు.ఎస్సీ మహిళా రిజర్వేషన్ కింద వార్డు సభ్యురాలిగా ఎన్నికైనప్పటి నుంచి సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ కోల బాలగౌడ్, ఉపాధ్యాయుడు కొంగల వెంకటి, 2వ వార్డు సభ్యురాలి భర్త కంఠం సిద్ధారాములు తనపై వ్యక్తిగత కక్షతో వేధింపులకు పాల్పడుతున్నారని ప్రత్యూష పేర్కొన్నారు.తాను ఎస్సీ కులానికి చెందినది కాదంటూ గత మార్చిలో జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో తన వార్డు సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఫిర్యాదు చేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌తో పాటు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రత్యూష తెలిపారు. మహిళా ప్రజాప్రతినిధిని వేధిస్తున్న వారిపై అధికారులు స్పందించి విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## మంథని విద్యుత్ అధికారుల తీరుపై కౌన్సిలర్ ఆగ్రహం

- బోయినపేట్ సమస్యలు తీర్చలి
- మున్సిపాలిటీ ఆఫీసు ముట్టడి స్తామని హెచ్చరిక
- కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్



**.ప్రజా వాయిస్ మంథని** మంథని మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని బోయినపేట్ ప్రాంతంలో తీవ్రమైన విద్యుత్ సమస్యలు నెలకొన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల వైఖరి మారకపోతే విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించి, నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇళ్లకు, రాకపోకలకు ఆటంకాలు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న పాత స్తంభాలు, వైర్లను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. కొన్ని వీధుల్లో అసలు విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రివేళల్లో చీకటిరాజ్యమేలుతోందని, దీంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా మారిన పాత స్తంభాలు పలు ప్రాంతాల్లో విరిగిపోయిన, పాత ఇనుప స్తంభాలు ప్రమాదభరితంగా ఉన్నాయని శ్రీలత తెలిపారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ఇవి కూలిపోతే జరిగే ప్రాణనష్టానికి ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. అలాగే బోయినపేటకు వెళ్లే పాత కట్ట ప్రధాన రహదారిపై వెలుతురు లేక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

### ముట్టడికి సిద్ధం..

ఈ సమస్యలపై అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వీధిదీపాలు, విద్యుత్ వైర్లు, మీటర్ కనెక్షన్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి సబ్‌స్టేషన్ లేదా విద్యుత్ ఆఫీసును ముట్టడిస్తామని స్పష్టం చేశారు.



## కరెంట్ కట్.. రైతుకు షాక్.!

- 24 గంటల హామీ ఏమైంది?
- 9 గంటల సరఫరాతో పంటలు ఎండిపోతున్నాయ్
- కోదాడ సబ్ స్టేషన్ గేట్లు మూసివేసి రైతుల ధర్నా
- కోతలు ఎత్తేయాలని డిమాండ్
- లేకుంటే సబ్ స్టేషన్ల ముట్టడికి హెచ్చరిక

**ప్రజా వాయిస్,కోదాడ:** వ్యవసాయానికి విధిస్తున్న విద్యుత్ కోతలను తక్షణమే రద్దు చేసి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్ సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. సబ్‌స్టేషన్ గేట్లు మూసివేసి నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు.

### హామీ 24 గంటలు.. అమలు 9 గంటలే.!

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని విస్మరించిందని బొల్లు ప్రసాద్ విమర్శించారు. తొలుత 24 గంటల విద్యుత్ సరఫరా చేసి.. అనంతరం 18, 13 గంటలకు తగ్గించి.. ప్రస్తుతం కేవలం 9 గంటలకే పరిమితం చేశారని ఆరోపించారు. ఒకవైపు వర్షాలు సక్రమంగా లేకపోవడం.. మరోవైపు విద్యుత్ కోతలతో పంటలు పొట్ట దశలోనే ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు.రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకుండా విద్యుత్ కోతలు విధించడం దారుణమన్నారు. వెంటనే కోతలను ఎత్తివేసి నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే సబ్‌స్టేషన్లను ముట్టడించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నీళ్ల పేరుతో కేటీఆర్ నికృష్ట రాజకీయాలు చేస్తుండు

- కేటీఆర్ కు పని పాట లేకే మిర్యాలగూడకు వచ్చారా?
- సాగర్ నీళ్ల గురించి బీఆర్ ఎస్ నుంచి నేర్చుకోవాల్సిన ఖర్మ మాకు లేదు
- మిర్యాలగూడ రైస్ బౌల్ గా మారింది కాంగ్రెస్ హయాంలోనే
- రైతుల జీవితాలతో రాజకీయాలు చేయడం బీఆర్ ఎస్ కే చెల్లింది
- రైతుల శవాలపై రాజకీయాలు చేసి ఓట్లు సంపాదించుకోవాలన్నదే కేటీఆర్ ఆలోచన
- రుణమాఫీ, రైతుభరోసా, బోనస్ తో రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- కేటీఆర్ పై తీవ్ర విమర్శలు చేసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్.



**.ప్రజా వాయిస్,మిర్యాలగూడ:** రైతుల సమస్యల పేరుతో బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్‌కు పని పాట లేకే మిర్యాలగూడకు వచ్చి రైతు ధర్నా చేశారని ఎద్దేవా చేశారు. నీళ్ల పేరుతో రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు.కేటీఆర్ మిర్యాలగూడ రైతులకు వరి పంట పండించడం కేసీఆర్, జగదీశ్‌రెడ్డి నేర్పించినట్లు గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టును నిర్మించింది కాంగ్రెస్ పార్టీయేనని, మిర్యాలగూడ రైతులకు దశాబ్దాలుగా సాగునీరు అందించింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వాలేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలోనే మిర్యాలగూడ ప్రాంతం తెలంగాణ రైస్‌బౌల్‌గా రూపుదిద్దుకుందని తెలిపారు. నీళ్ల గురించి బీఆర్ఎస్ అనే బచ్చా పార్టీ నుంచి తాము నేర్చుకోవాల్సిన అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు.సాగర్ నుంచి నీటిని ఎప్పుడు విడుదల చేయాలి, ఎంత మేరకు విడుదల చేయాలనే అంశంపై తమకు పూర్తి అవగాహన ఉందని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. రైతుల జీవితాలతో తాము బీఆర్ఎస్ మాదిరిగా రాజకీయాలు చేయబోమన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని, ఎల్‌నినో ప్రభావంతో ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని తెలిపారు. ఈ ఏడాది కూడా ఇదే తరహా పరిస్థితులు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్న నేపథ్యంలో సాగునీటి కంటే తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు.అందుకే ప్రభుత్వం ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు సూచిస్తోందని, రైతులు కూడా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. అయితే బీఆర్ఎస్ మాత్రం రైతులను రెచ్చగొడుతోందని ఆరోపించారు. పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించి, నీళ్లు అందక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి రావాలని బీఆర్ఎస్ కోరుకుంటోందా అని ప్రశ్నించారు. రైతుల శవాలపై రాజకీయాలు చేసి ఓట్లు సంపాదించుకోవాలన్నదే కేటీఆర్ ఆలోచనగా కనిపిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రైతు అంటే కాంగ్రెస్.. నీళ్లు అంటే కాంగ్రెస్ అని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం రుణమాఫీ చేసిందని, రైతుభరోసా అందిస్తోందని, మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేస్తోందని, వరికి బోనస్ ఇస్తోందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసిందని పేర్కొన్నారు.సాగర్ ఆయకట్టుకు నీరు అందించే అవకాశం ఉన్న ప్రతిసారీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. శ్రీశైలం జలాశయం మరింత నిండి సాగర్‌కు వరద నీరు రావాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. నీటి విషయంలో ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.కేసీఆర్ హయాంలో కూడా ఒకసారి ఆయకట్టుకు నీరు రాని పరిస్థితి ఏర్పడిందని, పలుమార్లు ఆరుతడి పంటలకే నీటిని అందించిన సందర్భాలు ఉన్నాయని ఎమ్మెల్యేలు గుర్తుచేశారు. గత పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు నీళ్ల పేరుతో ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నీచ రాజకీయాలను రైతులు నమ్మవద్దని, రైతుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే నవీన్‌కుమార్ స్పష్టం చేశారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు

- మిర్యాలగూడలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- రథయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, నవీన్ యాదవ్
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలుఉట్ల వేడుకల్లో సందడి చేసిన యాదవ సోదరులు
- భవిష్యత్ తరాలకు పండుగల విశిష్టతను చాటాలి
- .హాజరైన ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్,మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు,



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేవే పండుగలని, వాటి విశిష్టతను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, నవీన్‌యాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పంచమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, నవీన్‌యాదవ్ యాదవ సోదరులు, భక్తులతో కలిసి శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి ధర్మం, సత్యం, న్యాయానికి ప్రతీకగా నిలిచే పర్వదినమన్నారు. శ్రీకృష్ణుని బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన ధర్మమార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు.యాదవ సమాజం ఐక్యత, అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు ఉట్ల కొట్టే సంప్రదాయంలో కుండ చీకటికి, అందులోని పాలు, పెరుగు, వెన్న, నెయ్యి వెలుగు, జ్ఞానానికి ప్రతీకలుగా భావిస్తారని బడుగుల లింగయ్య యాదవ్ వివరించారు. అజ్ఞానం అనే చీకటి నుంచి జ్ఞానం అనే వెలుగు వైపు నడిపించడమే ఈ సంప్రదాయం అంతరార్థమన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు మాట్లాడుతూ యాదవులు శ్రీకృష్ణుని వారసులుగా ధర్మ పరిరక్షణకు, దుష్టశిక్షణకు కట్టుబడి ఉంటారన్నారు. . కార్యక్రమంలో యాదవ సంఘం నిర్వాహకులు గుడిపాటి కోటయ్య యాదవ్, కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, పగిడి రామలింగయ్య, కట్టబోయిన రామలింగయ్య, యాదవ కౌన్సిలర్లు మలగం రమేష్, గంగుల బిక్షం, పుట్టపాక శ్రీనివాస్, పొదిల నిక్షిత్, పట్టణ ప్రధాన కార్యదర్శి పిన్నిబోయిన శ్రీనివాస్ యాదవ్, సర్నాల వెంకయ్య యాదవ్, గాలం వెంకన్న, చిమట మదార్, పొదిల వెంకన్న, వార్త లక్ష్మణ్, నడ్డి శివకృష్ణ, జొన్నలగడ్డ సాయి, రమాదేవి వెంకట్, మహేష్ యాదవ్, జడ రాములు, చిర్ర మల్లయ్య, డొంకల వెంకటేశ్వర్లు, గుడిపాటి లలిత, నాగేంద్ర, మంగ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల ముసుగులో అక్రమ వెంచర్ దందా.!


- గంధంగూడ సర్వే నంబర్ 38లో ప్రభుత్వ అనుమతుల్లేకుండా లేఅవుట్
- గజం రూ.75 వేలకు విక్రయం
- అధికార పార్టీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఫుల్ సపోర్ట్.?
- చర్యలు తీసుకోవడంలో మీన మేషాలు లెక్కిస్తున్న అధికారులు



**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:**జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో అక్రమ వెంచర్ల దందా జోరుగా సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నాయి. గంధంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 38లో 3 ఎకరాలు 30 గుంటల భూమిలో,ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు సాగిస్తు,రెండు భవనాల నిర్మాణాలు సైతం చేపట్టిన రియల్టర్లు.అన్ని ప్రభుత్వ అనుమతులు ఉన్నాయంటూ అమాయక కొనుగోలుదారులను నమ్మిస్తూ,గజం రూ.75 వేల చొప్పున ప్లాట్లను విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వెంచర్‌కు సంబంధించి అనుమతులు,లేఅవుట్ అప్రూవల్, ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాలు ఉన్నాయంటూ ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్న రియల్ వ్యాపారులు.ఈ తతంగం అంతా జాగిర్‌లోని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే జరుగుతుందని సమాచారం.అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసి అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న అక్రమార్కులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని జాగిర్ ప్రజలు మండిపడుతున్నారు.ముఖ్యంగా సర్వే నంబర్ 38లో జరుగుతున్న ప్లాట్ల విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టి, కొనుగోలుదారులు మోసపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్న జాగిర్ ప్రజానీకం.



### లాంటి అనుమతులు లేవు, చర్యలు తీసుకుంటాం



అయితే ఈ వెంచర్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఎస్ఐఆర్‌లో 'కొర్రీ'ల పర్వం.!

- పక్క డివిజన్లలో ధ్రువపత్రాలకు ఓకే.. రాజేంద్రనగర్ లోనే ఎందుకీ మెలికలు
- అవసరమైన పత్రాలున్నా అదనపు సర్టిఫికెట్ల డిమాండ్
- ఓటర్లకు తప్పని తిప్పలు
- నిబంధనలు స్పష్టం చేయాలని ఈఆర్ ఓకు బాధితుల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్/రాజేంద్రనగర్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిబంధనల అమలుపై గందరగోళం నెలకొంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా నిబంధనలు అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న కొందరు ఓటర్లు తమ వద్ద ఉన్న అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించినా.. సిబ్బంది అదనపు పత్రాలు కోరుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అదనపు పత్రాల కోసం డిమాండ్

నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి తల్లిదండ్రుల కుల ధ్రువపత్రాలు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరుతున్నారని పలువురు చెబుతున్నారు. అవి అందుబాటులో లేని పరిస్థితుల్లో భర్త కుల ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వం జారీ చేసిన ఇతర ధ్రువపత్రాలను సమర్పించినా స్వీకరించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో తమ ఓటు కొనసాగుతుందో లేదోనన్న ఆందోళనలో పడుతున్నామని పేర్కొంటున్నారు.

## పక్క డివిజన్లలో ఓ తీరు.. ఇక్కడ మరో తీరు.!

పక్క డివిజన్లలో ఆధార్, రేషన్ కార్డు తదితర ధ్రువపత్రాలు సమర్పిస్తే సరిపోతుందని అధికారులు, బీఎల్‌వోలు చెబుతున్నారని ఓటర్లు పేర్కొంటున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నిబంధనలు ఉంటే.. వాటి అమలులో ప్రాంతానికో విధానం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలతో కార్యాలయాలకు వెళ్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో వార్డు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

## ఈఆర్ ఓ స్పష్టత ఇవ్వాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు అనవసర ఇబ్బందులు కలగకుండా ఒకే విధమైన నిబంధనలు, మార్గదర్శకాలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు. ఏయే ధ్రువపత్రాలు చెల్లుబాటు అవుతాయనే అంశంపై ఈఆర్ఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నోటీసులు అందుకున్న అర్హులైన ఓటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై నెలకొన్న గందరగోళానికి తెరదించాలని కోరుతున్నారు.



# హాలియాలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ప్రజా వాయిస్,హాలియా:** హాలియా పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, సంప్రదాయబద్ధంగా ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్లు కొట్టి సందడి చేశారు.శ్రీకృష్ణుడి జన్మాష్టమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నడ్డి రాంచందర్ యాదవ్,చింతల చంద్రారెడ్డి,రాజా రమేష్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్, సంద్ర కొండల్ యాదవ్, మన్నెం వెంకటేశ్వర్లు యాదవ్, చిల్లుకాల కాశియ్య యాదవ్, రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 22ఏలో రైతు భూములా..?

- 42,867 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి: హరీశ్ రావు ఫైర్
- రాష్ట్రంలో 14.50 లక్షల ఎకరాలు 22ఏలో.. రైతులను కబ్జాదారులుగా అవమానించడం దారుణం
- సెప్టెంబర్ 7లోగా సమస్య పరిష్కరించకపోతే ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన

**ప్రజా వాయిస్,కాగజ్‌నగర్:** సిర్పూర్(టి) నియోజకవర్గంలో 42,867 ఎకరాల రైతు భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని, వాటిని వెంటనే జాబితా నుంచి తొలగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ కౌటాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.నియోజకవర్గంలోని కౌటాలలో 6,350, చింతలమానేపల్లిలో 8,878, బెజ్జూరులో 8,325, కాగజ్‌నగర్‌లో 6,690, సిర్పూర్(టి)లో 4,406, పెంచికల్‌పేటలో 2,950, దహెగాంలో 5,268 ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని హరీశ్‌రావు వివరించారు. భూములు 22ఏలో ఉండటంతో రైతులకు బ్యాంకు రుణాలు, ఎరువులు, రైతుబంధు, బీమా వంటి ప్రయోజనాలు అందడం లేదని ఆరోపించారు. భూముల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు సైతం నిలిచిపోయాయని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో 14.50 లక్షల ఎకరాలు

రాష్ట్రవ్యాప్తంగా 14.50 లక్షల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని హరీశ్‌రావు అన్నారు. రైతులను కబ్జాదారులుగా అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

## సెప్టెంబర్ 7లోగా పరిష్కరించాలి

సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లోగా రైతుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెన్షన్లు, కల్యాణలక్ష్మి, దళితబంధు వంటి పథకాలు నిలిచిపోయాయని, పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు స్థానిక రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





# బీఆర్ఎస్, బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారు
- మంత్రి సీతక్క

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా, సెప్టెంబర్ 4:**/ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సీతక్క తీవ్రంగా మండిపడ్డారు. ములుగు జిల్లా కేంద్రంలో ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

## పదేళ్ల పాలనలో చేయనిది.. ప్రజా ప్రభుత్వం చేస్తోంది:

గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో చేయలేని అభివృద్ధిని ప్రజా ప్రభుత్వం చేసి చూపిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు.

## కేటీఆర్ ముందుగా తన పార్టీ నేతల చరిత్ర తెలుసుకోవాలి:

కాంగ్రెస్ నాయకులను కేటీఆర్ విమర్శించే ముందు తన పక్కన ఉన్న నాయకుల రాజకీయ నేపథ్యాన్ని పరిశీలించుకోవాలని సీతక్క సూచించారు. తన తండ్రి కేసీఆర్ రాజకీయ ప్రస్థానం ఎక్కడి నుంచి ప్రారంభమైందో కూడా గుర్తు చేసుకుని మాట్లాడాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు.

## దళిత ముఖ్యమంత్రి హామీ ఏమైంది?

అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, చేయకపోతే తల నరుక్కుంటామని చెప్పిన హామీని బీఆర్ఎస్ నాయకులు మరిచిపోయారా అని సీతక్క ప్రశ్నించారు. దళిత కుటుంబాలకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తామని హామీ ఇచ్చి ఎంతమందికి భూమి ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులను మాయమాటలతో మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని విమర్శించారు.

## కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు ఎందుకు తేవడం లేదు?

:బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఎందుకు విడుదల చేయించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలపై బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సక్రమంగా విడుదల చేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

## ప్రజల తీర్పు మరోసారి తప్పదు:

బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చిల్లర రాజకీయాలు పక్కనపెట్టి హుందాగా వ్యవహరించాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధిపై నిర్మాణాత్మకంగా మాట్లాడితే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. తప్పుడు ఆరోపణలు, రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ప్రజల చేతిలో మరోసారి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఈ సమావేశంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు పల్లె జైపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నెలన్నరగా చీకటే.. అధికారులు నిద్రలోనేనా..?

- నెలన్నరగా వీధిదీపాలు బంద్ .. రాత్రయితే బయటకు రావాలంటేనే జనం జంకు
- ఫిర్యాదులు ఎన్నిసార్లు చేసినా పట్టించుకోని వైనం
- పాములు, తేళ్ల భయంతో గ్రామస్థుల బిక్కుబిక్కు

**ప్రజా వాయిస్,కౌటాల:** నెలన్నరగా వీధిదీపాలు వెలగక ఓ గ్రామం చీకట్లో మగ్గుతోంది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండైపేటలో వీధిదీపాల నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే చాలు.. ప్రధాన రహదారి నుంచి అంతర్గత వీధుల వరకు చీకటే దర్శనమిస్తోంది. స్తంభాలపై బల్బులు ఉన్నా వెలగక షోపీస్‌లుగా మారాయి.

## 'వెలుగు' కోసం ఇన్ని రోజులా?

వీధిదీపాలు పనిచేయడం లేదని వార్డు సభ్యులు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. 'రేపు వస్తాం.. ఎల్లుండి బాగుచేస్తాం' అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప నెలన్నర గడిచినా కనీసం బల్బులు మార్చలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక చిన్న సమస్య పరిష్కారానికి ఇంత సమయం పడితే గ్రామంలో మౌలిక వసతుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## పాములు.. తేళ్ల భయం

చీకటి కారణంగా రాత్రివేళల్లో బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని మహిళలు, వృద్ధులు, చిన్నారులు చెబుతున్నారు. వీధుల్లో గడ్డి, పొదలు ఉండటంతో పాములు, తేళ్లు సంచరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ ఇంట్లోకి పాము రావడంతో



భయాందోళనకు గురయ్యామని గ్రామస్థులు తెలిపారు.

## అధికారులు ఇకనైనా మేల్కొనాలి!

గుండైపేటలో నెలకొన్న వీధిదీపాల సమస్యపై జిల్లా అధికారులు తక్షణమే దృష్టిసారించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఎంపీడీవో, పంచాయతీ అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించి వీధిదీపాలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# నకిరేకల్‌లో సీఎం సభ.. ట్రాఫిక్ ఆంక్షలు

- నేడు నకిరేకల్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపులు
- సభకు భారీగా ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో పోలీసుల ప్రత్యేక ఏర్పా
- ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ప్రత్యేక దారి మళ్లింపులు
- జిల్లా ఎస్పి.శరత్ చంద్ర పవార్.

**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్** నల్గొండ, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, శాలిగౌరారం, కేతేపల్లి వైపు నుంచి వచ్చే వారికి ప్రత్యేక మార్గం.తిప్పర్తి సర్వీస్ రోడ్డు నుంచి ఇందిరాగాంధీ సెంటర్ మీదుగా మినీ స్టేడియం గ్రౌండ్‌కు చేరుకోవాలని సూచన.సభా ప్రాంగణం వద్దకు బైక్‌లు, ఆటోలు, కార్లు, బస్సులు తీసుకురావద్దని పోలీసుల విజ్ఞప్తి.పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలి.పార్కింగ్ ప్రాంతాల నుంచి సూచించిన మార్గాల్లో సభా ప్రాంగణానికి చేరుకోవాలి.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు.ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా పోలీసుల ముందస్తు ఏర్పాట్లు.ట్రాఫిక్ మళ్లింపులు, పోలీసుల సూచనలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి......

# పేదల బియ్యానికి పంగనామం
# పానుగల్ గోదాంలో బియ్యం గోల్ మాల్.!

- మూడు నెలల్లో 100 బస్తాలు తక్కువగా ఉన్నాయంటూ ఆరోపణలు
- విచారణ పేరుతో తూతూమంత్రం.. చర్యలు శూన్యం
- ఆగస్టులోనూ అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు
- సమగ్ర విచారణకు మండల ప్రజల డిమాండ్




**ప్రజా వాయిస్,వనపర్తి:**వనపర్తి జిల్లా పానుగల్ మండలంలోని పౌరసరఫరాల గోదాంలో బియ్యం నిల్వలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిరుపేదలకు అందాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యంలో అవకతవకలు జరుగుతున్నాయంటూ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గోదాంలో కొంతకాలంగా అక్రమాలు జరుగుతున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 100 బస్తాల తేడా..?

మే, జూన్, జూలై నెలల్లో బియ్యం సరఫరాకు సంబంధించి సుమారు 100 బస్తాలు తక్కువగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేపట్టినా.. పూర్తి స్థాయిలో కాకుండా తూతూమంత్రంగా నిర్వహించి వదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. గోదాంలోని భౌతిక నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా, రవాణా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

## ఆగస్టులోనూ ఆరోపణలు

ఆగస్టు నెలలోనూ గోదాంలో అవకతవకలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పేదలకు చేరాల్సిన బియ్యంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు.

## అధికారి హాజరుపైనా ఆరోపణలు

మండల పౌరసరఫరాల అధికారి నర్సింహులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణ లోపించడం వల్లే గోదాం నిర్వహణలో అవకతవకలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

## విజిలెన్స్ కు ఫిర్యాదు చేస్తాం

గోదాంలోని బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, రవాణా వివరాలు, రేషన్ దుకాణాలకు జరిగిన కేటాయింపులు, పంపిణీ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నిరుపేదల బియ్యం పక్కదారి పట్టకుండా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.




# హామీలు ఎక్కడ రేవంత్ రెడ్డి..?

- వెయ్యి రోజుల పాలన.. మహిళల హామీలపై సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ పై పైలట్ రోహిత్ రెడ్డి ధ్వజం
- తాండూరు పట్టణంలోని భద్రేశ్వర కూడలిలో వంటావార్పు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు,వృద్ధులు,వికలాంగులు

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ తాండూరు పట్టణంలోని భద్రేశ్వర కూడలిలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో నిర్వహించిన సదస్సులో భాగంగా చేపట్టిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పైలట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మహిళకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని, ప్రతి మహిళను మహాలక్ష్మిగా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించిందని ఆరోపించారు.మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినప్పటికీ, సరిపడా బస్సులు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు బస్‌స్టాండ్‌లో గంటల తరబడి వేచి చూసినా బస్సులు అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు.రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి కొంత మందికి మాత్రమే అందించి అందరికీ పథకం అమలు చేసినట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెళ్లి చేసుకున్న మహిళల్లో ఒక్కరికైనా హామీ ఇచ్చిన తులం బంగారం అందిందా? అని ప్రశ్నించారు.అలాగే ఆసరా పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. వెయ్యి రోజుల పాలన పూర్తయినా ఆ హామీని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.



# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- వృద్ధులు, వికలాంగులు, మహిళలతో కలిసి బీఆర్ ఎస్ నిరసన
- హాజరైన ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పని విజయసింహ రెడ్డి.

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరై హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సాగర్ రోడ్డుపై వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి.. ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.. ప్రజలకు న్యాయం చేయాలి" అంటూ నినాదాలతో సాగర్ రోడ్డును హోరెత్తించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నబీమోజు నాగార్జునచారి, ఎండి. యూసుఫ్, పెండ్యాల పద్మావతి, కుర్ర చైతన్య, అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటిరెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జ్‌లు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.



# మురుగు ముప్పులో పార్థసారథి కాలనీ.!

- చెరువును తలపిస్తున్న డ్రైనేజీ నీరు
- దుర్వాసన, దోమలతో జనం అవస్థలు
- ప్రధాన డ్రైనేజీని కాలనీ వైపు మళ్లించారంటున్న స్థానికులు
- అధికారుల తీరుపై ఆగ్రహం

**పటాన్‌చెరు, ప్రజావాయిస్:**ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పార్థసారథి కాలనీని డ్రైనేజీ సమస్య వణికిస్తోంది. కాలనీలోకి భారీగా మురుగునీరు చేరి నిలిచిపోవడంతో పరిసరాలు చెరువును తలపిస్తున్నాయి. దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం.. 9వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన డ్రైనేజీ లైన్‌కు సంబంధించిన మ్యాన్‌హోల్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలోని ప్రధాన డ్రైనేజీ ప్రవాహాన్ని పార్థసారథి కాలనీ వైపు మళ్లించినట్లు ఆరోపిస్తున్నారు. దీంతో కాలనీలోకి మురుగునీరు భారీగా చేరుతోందని తెలిపారు.సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తరచూ అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి కాలుష్యంతో కాలనీలో నివసించడమే కష్టంగా మారిందని పేర్కొన్నారు.

### శాశ్వత పరిష్కారం చూపాలి

డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన చోట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

# మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు

- జిల్లా అధికారులు ప్రభుత్వ భూములపై c సమగ్ర విచారణ జరపాలి
- రూ.కోట్ల విలువైన భూములు స్వాహా?
- ముత్తారం ఎంఆర్ ఓ నిమ్మకు నీరెత్తిన వైఖరి
- స్పందించని రెవెన్యూ, విద్యుత్ శాఖలు
- జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలి అని ప్రజల డిమాండ్



**ప్రజా వాయిస్ మంథని** పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణదారులు యథేచ్ఛగా రూ.కోట్ల విలువైన సర్కారు భూములను కబ్జా చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల భర్తలే కీలక పాత్రధారులుగా మారి ప్రభుత్వ భూముల్లోకి విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. సిరిపురం శివారులోని సర్వే నంబర్లు 124/A/2, 161/2, 124/A/1 లోని ప్రైవేటు భూముల పేరుతో డీడీలు తీసి, రామగిరి మండలం ఉప్పర్ల కేసారం శివారులోని సర్వే నంబర్ 35లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి విద్యుత్ లైన్లను మళ్లించారు. దుబ్బపల్లె సర్వే నంబరు 173 నుంచి ఉప్పర్ల కేసారం ప్రభుత్వ భూమి వరకు విద్యుత్ స్తంభాలు నాటి, అక్రమంగా కనెక్షన్లు ఇచ్చేందుకు కిందిస్థాయి అధికారులు సైతం సహకరించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ముత్తారంలో నిమ్మకు నీరెత్తిన ఎమ్మార్వో!

మరోవైపు ముత్తారం మండలం ఖమ్మంపల్లిలోని సర్వే నంబర్ 617లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా స్థానిక ఎమ్మార్వో (తహసీల్దార్) పూర్తిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకొని కబ్జాదారులు కోట్ల రూపాయల విలువ చేసే భూమిని ఆక్రమిస్తున్నా రెవెన్యూ యంత్రాంగం కనీసం దృష్టిసారించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సమగ్ర విచారణ జరిపి భూములను కాపాడాలి

ప్రభుత్వ భూములపై వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, ఆక్రమించిన రూ.కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకోవాలని ముత్తారం, మంథని, రామగిరి మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లైన్లు వేసిన విద్యుత్ శాఖ సిబ్బందిపై, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మరణానికి దారితీస్తున్న మానేరు వంతెన.!




- అడవి సోమన్ పల్లి వద్ద మానేరు వంతెనకు భారీ కన్నం
- బయటపడ్డ ఇనుప కడ్డీలు
- అరకొర మరమ్మతులతో ప్రమాదకరంగా మారిన వంతెన
- ఏ క్షణాన కూలుతుందోనని వాహనదారుల భయం

**ప్రజా వాయిస్, మంథని:** పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లి గ్రామ సమీపంలోని మానేరు వంతెన వాహనదారులకు వణుకు పుట్టిస్తోంది. వంతెనపై కాంక్రీట్ స్లాబ్ ఊడిపోయి భారీ కన్నం ఏర్పడటంతో లోపల ఉన్న ఇనుప కడ్డీలు, మెటల్ ఫ్రేమ్‌లు బయటపడ్డాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ వంతెనపై ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కనిపించేది గుంత కాదు.. ప్రమాదమే!

వంతెనపై రహదారి కాంక్రీట్ పూర్తిగా దెబ్బతిని కిందికి పెద్ద రంధ్రం ఏర్పడింది. రాత్రివేళల్లో ఈ ప్రమాదకర గుంతను గుర్తించక ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు అందులో పడితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాద ప్రాంతం వద్ద కేవలం కొన్ని కర్రలు, జెండాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.

### అతుకుల రిపేర్లతోనే సరిపెట్టారా?

గతంలో వంతెన మరమ్మతుల పేరిట చేపట్టిన పనులు నాణ్యత లేకపోవడంతోనే పరిస్థితి ఇంత దారుణంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపకుండా అరకొరగా మరమ్మతులు చేయడం వల్లే ఇప్పుడు కాంక్రీట్ స్లాబ్ ఊడిపోయి ఇనుప కడ్డీలు బయటపడ్డాయని అంటున్నారు.

### వేలాది వాహనాల రాకపోకలు

మంథని ప్రాంతాన్ని జిల్లా కేంద్రంతో పాటు మహారాష్ట్ర, భూపాలపల్లి తదితర ప్రాంతాలకు అనుసంధానించే కీలక మార్గంలో ఈ వంతెన ఉంది. ఆర్టీసీ బస్సులు, పాఠశాల వాహనాలు, ఆటోలు, కార్లు, భారీ లారీలు నిత్యం ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటాయి. ఇంత కీలకమైన వంతెనపై ప్రమాదకర పరిస్థితి నెలకొన్నా ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

### ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?

వంతెనకు వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు వేచి చూస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

# కళ్యాణలక్ష్మికి 'తులం బంగారం' ఇవ్వాల్సిందే

- హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ను వదిలేది లేదు
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**ప్రజా వాయిస్,గోదావరిఖని:** కళ్యాణలక్ష్మి కింద రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇవ్వాలని, ఎన్నికల హామీలన్నీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటా–వార్పు, మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి 33 నెలలు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించకుండా, కళ్యాణలక్ష్మి తులం బంగారం అందించిన తర్వాతే పిలవాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. హామీలు అమలు చేయకపోతే మహిళల పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని చందర్ హెచ్చరించారు.



# ఏసీబీ వేట కొనసాగుతున్నా ఆగని అవినీతి దందా

- ఏసీబీ... అవినీతిని ఎందుకు అంతం చేయలేకపోతుంది?
- ఒకడు పట్టుబడుతున్నారు... మరొకడు పుట్టుకొస్తున్నాడు!
- అవినీతి అధికారుల్లో ఉందా? వ్యవస్థలో ఉందా?

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 4** అవినీతికి అడ్డుకట్ట వేస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఏసీబీ దాడులు, కేసులు, అరెస్టులు జరుగుతున్నప్పటికీ కొందరు అధికారులు, సిబ్బందిలో లంచాల పద్ధతి మారడం లేదు ఒక అధికారి పట్టుబడుతున్నాడు.. మరొకరు అదే బాటలో నడుస్తున్నారు. దీంతో అవినీతిపై ప్రభుత్వ చర్యలు ఎంతవరకు ఫలిస్తున్నాయన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు తమ పని సకాలంలో పూర్తవుతుందన్న నమ్మకం కరువవుతుందనే విమర్శలు ఉన్నాయి. చిన్నపాటి ధ్రువీకరణ పత్రం నుంచి భూమి వ్యవహారాలు, ప్రభుత్వ పథకాల వరకు..చాలా చోట్ల పని ఏమిటి ? లంచం ఎంత? అనే పరిస్థితి నెలకొంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ హక్కుగా అందాల్సిన సేవ కోసం కూడా అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం, చివరకు డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి రావడం సామాన్యుడిని తీవ్రంగా వేధిస్తుంది.

### ఏసీబీ భయం ఎందుకు కనిపించడం లేదు?

లంచం తీసుకుంటూ పట్టుబడిన వారిపై ఏసీబీ కేసులు నమోదు చేస్తోంది. అరెస్టులు కూడా జరుగుతున్నాయి. అయినప్పటికీ అవినీతి పూర్తిగా తగ్గకపోవడానికి కారణమేంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఒక్కరిని పట్టుకోవడం కంటే.. అవినీతికి అవకాశం కల్పించే వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కార్యాలయాల్లో పారదర్శకత, సేవలకు గడువు, అధికారులపై నిరంతర పర్యవేక్షణ, ఫిర్యాదులపై వేగవంతమైన చర్యలు ఉంటేనే పరిస్థితిలో మార్పు వస్తుందని అంటున్నారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యమే అవినీతికి బలం?...

అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ జరపడం మాత్రమే కాకుండా.. ఎందుకు అవినీతికి అవకాశం ఏర్పడింది? ఎవరి అండతో అది కొనసాగుతోంది? గతంలో వచ్చిన ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారు? అన్న విషయాలపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.అవినీతి అధికారి పట్టుబడిన తర్వాత చర్యలు తీసుకోవడం ఒక కోణం అయితే.. పట్టుబడకుండా వ్యవస్థలో కొనసాగుతున్న అవినీతిని గుర్తించడం మరో కీలక అంశం.

### అసలు అవినీతికి మూలం ఎక్కడ?...

అవినీతి కేవలం అధికారుల దగ్గరే ఉందని చెప్పడం సులభం. ప్రజలే కారణమని చెప్పడం కూడా సులభమే. కానీ వాస్తవం అంత సులభం కాదు. అధికారం దుర్వినియోగం చేసే అధికారి తప్పు చేస్తున్నాడు.లంచం ఇచ్చి పని చేయించుకునే వ్యక్తి కూడా తప్పు చేస్తున్నాడు.ఇద్దరికీ అవకాశం కల్పించే బలహీనమైన వ్యవస్థ కూడా బాధ్యత వహించాలి. అందుకే అవినీతిపై పోరాటం ఒకరి మీద నిందలు వేయడంతో ముగియకూడదు.

### అసలు మారాల్సింది వ్యవస్థ

అవినీతిని కేవలం ఏసీబీ దాడులతోనే పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదు.ప్రతి ప్రభుత్వ సేవకు స్పష్టమైన గడువు ఉండాలి. ఫైల్ ఎక్కడ ఉందో ప్రజలకు తెలిసేలా పారదర్శక విధానం ఉండాలి. మధ్యవర్తుల జోక్యం తగ్గాలి. లంచం అడిగినట్లు ఫిర్యాదు వస్తే వేగంగా విచారణ జరగాలి. అవినీతి అధికారిని శిక్షించడం ఎంత ముఖ్యమో.. అవినీతికి అవకాశం లేకుండా వ్యవస్థను మార్చడం అంతకంటే ముఖ్యం.ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేయడానికి ఉండాలి తప్ప.. లంచాలు వసూలు చేసే కేంద్రాలుగా మారకూడదు. ఏసీబీ దాడులు అప్పుడప్పుడు జరిగే చర్యలుగా కాకుండా, అవినీతిని మూలాల నుంచి నిర్మూలించే నిరంతర వ్యవస్థగా మారాలి. లంచం అడిగే అధికారి భయపడే పరిస్థితి రావాలి.. లంచం ఇవ్వకుండా తన పని చేయించుకోగలమనే నమ్మకం సామాన్యుడికి కలగాలి. అప్పుడే అవినీతి నిర్మూలనలో ప్రభుత్వం నిజంగా విజయం సాధించినట్టవుతుంది.



### చివరగా ఒక్క మాట...

ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.ఏసీబీ దాడులు భయం పుట్టించాలి. చట్టం శిక్ష విధించాలి. ప్రభుత్వం వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. ప్రజలు లంచాన్ని నిరాకరించాలి. అప్పుడే అవినీతి నిజంగా తగ్గుతుంది. లేకపోతే.. ఈ రోజు ఒక అధికారి పట్టుబడతాడు రేపు మరొకరు పట్టుబడతారు కానీ అవినీతి మాత్రం అదే కార్యాలయంలో మరో రూపంలో కొనసాగుతూనే ఉంటుంది!అధికారులు నిజాయితీగా విధులు నిర్వహించాలి.ప్రజలు కూడా లంచం ఇవ్వకుండా తమ హక్కుల కోసం నిలబడాలి. లంచం తీసుకునే చేయి ఒక్కటే కాదు.. లంచం ఇచ్చే చేయి కూడా అవినీతి వ్యవస్థకు బలం ఇస్తుంది.అవినీతికి తలుపులు తెరిచే వ్యక్తి ఎవరైనా కావచ్చు.. కానీ ఆ తలుపులు శాశ్వతంగా మూసివేయాల్సిన బాధ్యత చివరిగా ప్రభుత్వంపైనే ఉంది. అవినీతిని వ్యక్తుల్లో వెతకడం కాదు..దాని మూలాలను వెతికి కూల్చాలి. ఏసీబీ దాడులు భయాన్ని కలిగించాలి.. కానీ అవినీతి నిర్మూలనకు ప్రజల్లో నమ్మకాన్ని కూడా కలిగించాలి.

# చదువుల కోసం పంపితే.. చాకిరీ చేయిస్తారా.?

- షాద్ నగర్ ఎస్సీ సమీకృత హాస్టల్ లో విద్యార్థులతో సరుకుల మోయింపు
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?
- సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ ఎఫ్ డిమాండ్

ప్రజా వాయిస్,షాద్‌నగర్:విద్యార్థుల చదువులు, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన హాస్టల్‌లో వారితో సరుకులు మోయిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని ఎస్సీ సమీకృత హాస్టల్‌లో విద్యార్థులతో కూరగాయలు, పండ్లు, గుడ్లు, ఇతర నిత్యావసర సరుకులను తరలిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆకాష్ నాయక్ ఆరోపించారు.తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలనే ఆశతో హాస్టళ్లకు పంపుతున్నారని, చాకిరీ చేయించేందుకు కాదని ఆకాష్ నాయక్ అన్నారు. హాస్టల్ నిర్వహణ, సరుకుల రవాణా పనులను సిబ్బంది పర్యవేక్షించాల్సి ఉండగా విద్యార్థులతోనే పనులు చేయించడం సరికాదన్నారు.సరుకులు తరలించే సమయంలో విద్యార్థులకు అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఘటనపై సంబంధిత శాఖాధికారులు తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సురక్షితమైన, చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు.



# వెయ్యి(1000) రోజుల ప్రజా పాలనలో ప్రగతి పథంలో తెలంగాణ రాష్ట్రం

**అసెంబ్లీకి రాకుండా ప్రజాధనాన్ని వృధా చేస్తున్నా కెసిఆర్**

**కెసిఆర్ రాజీనామా చేయాలి**

**ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**వీపనగండ్ల మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ**

ప్రజా వాయిస్.. వనపర్తి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిఏనుముల రేవంత్ రెడ్డి మంత్రిజూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం పిలుపు మేరకు వీపనగండ్ల మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగింది అని అన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమే కదా అనివారు అన్నారు.మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా అన్నారు.సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నాణ్యమైన బియ్యం సరఫరా అర్హులకు అందరికి తెల్ల రేషన్ కార్డులు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంతో గత 10 సంవత్సరలు అధికారం లో ఉండి తెలంగాణ రాష్ట్రన్ని అప్పులకుప్పగా మార్చిన కేసీఆర్ నేటి నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో హాజరై ప్రతిపక్ష నేత స్తానం కి తగిన గౌరవం ఇవాలని మండిపడ్డారులేనిపక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రానున్న ఈ రెండు సంవత్సరాల లో కూడా అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అందుతాయని వారు అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి వచ్చి ఆయన



స్థానానికి గౌరవం ఇవ్వాలని ప్రజాధనాన్ని వృధా చేయకుండా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమస్యలను విని ప్రజలకు ఏం చేయాలో చెప్పాలని వారు డిమాండ్ చేశారు.కేటీఆర్ హరీష్ రావుల కాంగ్రెస్ ప్రభుత్వం పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని లేనిపక్షంలో తగిన అమూల్య కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెల్లించాల్సి వస్తుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు ఉప సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాహుల్‌పై కేసులు ఎత్తివేయాలి

**ఖర్గేను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం: షబ్బీర్ అలీ**

ప్రజా వాయిస్,కామారెడ్డి:

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై కేంద్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కులం పేరుతో అవమానించిన ఘటనను నిరసిస్తూ కామారెడ్డిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు.ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగాజలాలతో శుద్ధి చేశారన్న ఘటనను షబ్బీర్ అలీ తీవ్రంగా ఖండించారు. ఇది ఖర్గేను మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడమేనన్నారు. దేశంలో కుల వివక్ష, అంటరానితనానికి స్థానం లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ మరింత బలంగా పోరాడుతుందని హెచ్చరించారు.

**కేసీఆర్ రాజీనామా చేయాలి**

ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారో, వారి సమస్యలపై అసెంబ్లీలో ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. వరదలు, భారీ వర్షాలతో ప్రజలు నష్టపోయిన సమయంలో కేసీఆర్, కేటీఆర్ బాధితులను పరామర్శించలేదని విమర్శించారు.కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# 420 హామీలు.. అమలు ఏవి? కాంగ్రెస్‌పై ఎర్రబెల్లి ఫైర్

**దేవరుప్పులలో బీఆర్ఎస్ మహిళల వంటా వార్పు నిరసన**

**హామీల మాయలో కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసింది.**

**మహిళలు, రైతులపై నిర్లక్ష్యమేనా?**

**కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ధ్వజం**

**1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ భగ్గుమంది.. వంటా వార్పుతో నిరసన**

**రైతు బంధు నుంచి మహిళల హామీల వరకు.. కాంగ్రెస్ సర్కార్‌పై ఎర్రబెల్లి ఫైర్**

ప్రజా వాయిస్/దేవరుప్పుల సెప్టెంబర్ 04

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు మూడో రోజుకు చేరుకున్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు రోడ్డుపై వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకర్‌రావు, జిల్లా నాయకులు పల్లా సుందర్‌రాం రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

**హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: ఎర్రబెల్లి**

ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలన్నీ అబద్ధాలేనని విమర్శించారు. 420 హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని, రైతుబంధు పథకాన్ని మూడుసార్లు ఎగవేసిందని, రైతుబీమా పథకం అమలు కూడా సక్రమంగా లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పదేళ్లలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# అధికార పార్టీ ఎండగట్టే ప్రయత్నం బిఆర్ఎస్!?

**వంటావార్పు తో నిరసనలు చేస్తున్న మాజీలు!**

**100 రోజు కార్యక్రమంలో నిరసనలు**

**మహిళలు వృద్ధులు రైతులను మోసం చేశారని విమర్శలు!?**

**ఎనిమిది రోజుల ప్రణాళికలో భారీ సంఖ్యలో ప్రజానీకం!**

**అధికార పార్టీకి తలనొప్పిగా మారిన బీఆర్ఎస్ పార్టీ!?**

ప్రజా వాయిస్ అశ్వారావుపేట

అధికార పార్టీ కాంగ్రెస్ గద్దెనెక్కి 1000 రోజులు కావస్తున్న ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరు గ్యారెంటీ ల పేర్లతో అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రజలను నెట్టింట్లో ముంచిందని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు ఎనిమిది రోజులు కార్యక్రమం లో భాగంగా రోడ్లపై వంటావార్పుడి కార్యక్రమాలను నిర్వహించి నిరసన తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోనే దమ్మపేట పట్టణంలో ప్రధాన రహదారిపై పార్టీ మాజీ అధ్యక్షుడు దొడ్డ రమేష్ గారి ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమాన్ని కొనసాగించి ప్రభుత్వం వైఖరి పై నిరసన గోళం ఇప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమాన్ని గాలికి



వదిలేసారని కెసిఆర్ హయంలో పార్టీలకు అతీతులుగా ఈ కార్యక్రమాల నిర్వహించడం జరిగిందని అర్హులందరికీ రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ్ లక్ష్మీ. వంటి పథకాలు విజయవంతంగా అందించారని గిరిజన శతాబ్దాల కళ అయిన పోడు భూములకు పట్టాలి ఇచ్చిన ఘనత కెసిఆర్ దే కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలకు పూర్తిగా క్షీణించాయని మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్న స్పందించే విధానం లేదని మహిళలు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులలో ముఖ్యమంత్రి మాటను సొంత పార్టీ నేతల వినే పరిస్థితి లేదని వాళ్లకు వాళ్లే కొట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ఏ క్షణానైనా ప్రభుత్వం కూలే పరిస్థితి వస్తుందని రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే వృద్ధులకు 4000 రూపాయలు పెన్షన్ ఇస్తానని ఇప్పటివరకు ఇచ్చిన దాఖలా లేవని అశ్వారావుపేట పట్టణంలో ఉన్న వృద్ధాశ్రమానికి కొందరు వృద్ధులకి నేటికీ పెన్షన్లు రావడం లేదని ఒక్కొక్కరికి 66 వేల రూపాయలు చొప్పున బాకీ పడిన ప్రభుత్వం కాంగ్రెస్ దే అంటూ కళ్యాణ్ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి నమ్మబలికి నేటికీ పథకాన్ని అమలు చేయకుండా కాలయాపన చేశారని రైతుబంధు కింద రైతులకు కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతూ దగా చేసిందని విద్యార్థుల ఫీజు రియంబర్మెంటు నిలిపివేసిందని నిరుద్యోగ భత్యం ఎగగొట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు మండల మాజీ అధ్యక్షులు మండల నాయకులు మహిళలు పాల్గొన్నారు.



# కాపుగల్లులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు.. అన్నదానం, స్వామివారి ఊరేగింపు**

ప్రజా వాయిస్, కోదాడ:

**కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో శ్రీకృష్ణ మందిర ఆవరణలో** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, స్వామివారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి కోదాడ శాఖ సభ్యులు మాట్లాడుతూ.. భగవద్గీతలోని సంస్కృత శ్లోకాలకు ఇప్పటివరకు 330 మందికిపైగా స్వామీజీలు పలు భాషల్లో వివరణలు రాశారని తెలిపారు. శ్రీకృష్ణుడి బోధనలు మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక యాదవులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేసారంలో విషాదం.. ఒకే రోజు ముగ్గురి మృతి

**మృతుల కుటుంబాలకు సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ఆర్థిక సాయం**

ప్రజ వాయిస్/మోమిన్‌పేట్:

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం కేసారం గ్రామంలో ఒకే రోజు ముగ్గురు మృతి చెందడంతో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య మృతుల కుటుంబాలను పరామర్శించి తన వంతు సాయంగా ముగ్గురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మొత్తం రూ.15,000 ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన సర్పంచ్ కిష్టయ్య, ఆపద సమయంలో గ్రామ ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. సర్పంచ్ చేసిన ఆర్థిక సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.



# రైతు కోసం బీజేపీ పోరుబాట!

**ఈ నెల 7వ తేదీన దామెర మండల కేంద్రంలో రైతులతో కలిసి భారీ ధర్నా!**

**బిజెపి సీనియర్ నాయకులు గురిజాల శ్రీరామ్ రెడ్డి**

ప్రజా వాయిస్ హన్మకొండ /దామెర

రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రైతు రుణమాఫీని వెంటనే, పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దామే ర మండల కేంద్రంలో బిజెపి సీనియర్ నాయకులు గురి జాల శ్రీరామ్ రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రైతులతో కలిసి ధర్నా నిర్వహించనున్నాం.అలాగే మూడు విడతల రైతు భరోసా బకాయిలు వెంటనే చెల్లించాలని, సన్న వడ్ల బోనస్ అందించాలని, రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు-రాయితీలు సకాలంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.బీఆర్ఎస్ మోసం చేసింది... కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోంది!రైతుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, రైతుకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుంది.బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సూర చందర్, జిల్లా నాయకులు పిట్టల రమేష్, మండల ఉపాధ్యక్షులు దామసాని మనోజ్ రెడ్డి, లాదెళ్ల బుత్ అధ్యక్షులు అన్నబోయిన రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



# డిక్లరేషన్ల పేరుతో మోసం

## బాకీలు వెంటనే చెల్లించాలంటూ సుమన్ డిమాండ్

**ప్రజా వాయిస్ /క్యాతనపల్లి**
కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. క్యాతనపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహిళలకు గత ముప్పై మూడు నెలలుగా చెల్లించాల్సిన బకాయి రూ.82,500 ను ప్రభుత్వం వెంటనే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇస్తామన్న ఆసరా పెన్షన్ల పెంపును ఇకనైనా తాత్సారం చేయకుండా తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ప్రజావాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 4 :**
దోమకొండ మండలం కేంద్రం లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం జన్మాష్టమి వేడుకలు, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



# పదవి ఇచ్చిండ్రు.. ప్రాధాన్యం మరిచిండ్రు!

- సర్కారుపై సమరం అంటరు.. సొంత పార్టీలోనే సంగ్రామం!
- మండల అధ్యక్షుడికే సరైన దిక్కులేకపోతే.. కార్యకర్తల గతేంది అంటున్న శ్రేణులు
- తహసీల్దార్ ఆఫీసు సాక్షిగా.. బీఆర్ఎస్ లో బుసలుకొట్టిన అసంతృప్తి
- మనసుల్లో మంట.. మాటల్లో రచ్చ.. మొయినాబాద్ బీఆర్ఎస్‌లో అసలేం జరుగుతోంది..?

**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):**
బయట సర్కారుపై కొట్లాటకు బయల్దేరిన బీఆర్ఎస్‌కు.. సొంతింట్లోనే లొల్లి మొదలైందా? అనే చర్చ మొయినాబాద్ బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆ నోట ఈ నోట గట్టిగానే వినిపిస్తోంది. పార్టీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిన్న నిరసనకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న వేళ.. పార్టీలో చాలాకాలంగా లోలోపల రగులుతున్న అసంతృప్తి ఒక్కసారిగా బుసకొట్టిందన్న చర్చ సాగుతోంది.

**పదవి ఉంది.. ప్రాధాన్యం లేదంట!**
మండల అధ్యక్షుడిగా పదవి కట్టబెట్టినా.. ఆ పదవికి తగ్గ గౌరవం, ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ కొందరు శ్రేణులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం ఎండనకా.. వాననకా తిరిగిన కార్యకర్తలను పట్టించుకోకుండా ఎవరి లెక్క వాళ్లదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ కొందరు నాయకులు లోలోపల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**తహసీల్దార్ ఆఫీసు సాక్షిగా..**
కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నాయకులు.. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించే సమయంలో ఈ అంతర్గత అసంతృప్తి బయటకు వచ్చినట్లు చర్చ జరుగుతోంది.బయటికి మాత్రం అంతా ఒక్కటే అన్నట్టుగా కనిపించినా.. లోపల మాత్రం ఎవరి మనసులో మంట వాళ్లదే అన్నట్లుగా పరిస్థితి ఉందంటున్నారు.

**బయట కాంగ్రెస్‌తో కొట్లాట.. ఇంట్లో సొంతోళ్లతోనే లొల్లి!**
కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని అధిష్ఠానం పిలుపునిస్తుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడుతోందన్న మాట వినిపిస్తోంది.పార్టీ కోసం జెండా మోసినోళ్లను పట్టించుకోకపోతే.. రేపు జెండా పట్టుకునే వాళ్లు ఎక్కడి నుంచి వస్తరు?అంటూ కొందరు కార్యకర్తలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

**క్యాడర్‌లో గరం.. నాయకత్వంపై గుర్రు!**
పార్టీలో ఎవరి స్థాయి ఏదైనా.. పార్టీ అధ్యక్షుడి ఆదేశాలను గౌరవించి అందరూ ఒక్కతాటిపైకి రావాలని పలువురు నాయకులు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత ఆధిపత్యాలకు పోకుండా.. అందరినీ కలుపుకొని పోతేనే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని వారు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.లేకపోతే బయట సర్కారుపై ఎంత గట్టిగా సమరం చేసినా.. సొంతింట్లోనే లొల్లి కొనసాగితే పార్టీకి తీవ్ర నష్టం తప్పదన్న ఆందోళన శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.అయితే మొయినాబాద్ బీఆర్ఎస్‌లో రగులుతున్న ఈ అసంతృప్తి ఇంతటితో ఆగుతుందా? లేక రాబోయే రోజుల్లో మరింత రచ్చకెక్కుతుందా? అన్నది ఇప్పుడు శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# హామీలిచ్చి.. మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం !

**కాంగ్రెస్ పాలనలో మహిళలకు ఒరిగిందేమీ లేదు.**
**రూ.2,500 సాయం.. కల్యాణలక్ష్మి అదనపు సాయం ఏమైంది?**
**విద్యార్థినులకు స్కూటీ లు ఎక్కడ?.. గ్యాస్ సబ్సిడీ ఎక్కడ?**
**బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజా వాయిస్/పాలకుర్తి**
ఎన్నికల ముందు ఆర్భాటంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్య పెడుతోందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మహిళలు, విద్యార్థులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు పాలకుర్తి నియోజకవర్గంలోనీ రాయపర్తి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకంలో అదనపు సాయం, విద్యార్థినులకు స్కూటీ లు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని నాయకులు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్నా ఆ హామీల అమలుకు నిధులు కేటాయించకుండా ప్రజలను మభ్యపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోవడం లేదని



ఆరోపించారు.హామీలు అమలు చేయకుండా మాటలతో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

# శిరీష కుటుంబానికి కాంగ్రెస్ అండ..!..పొంగలేటి

**విమర్శలను అధిగమించి భరోసా కల్పిస్తున్న కాంగ్రెస్!**
**బిజెపిలో గిరిజన సంఘాలు గలమెత్తిన తగ్గేది లేదంటున్న వైనం.?**
**హత్య విలువ 5 లక్షలు ఇంద్ర మిల్లు ఔట్సోర్సింగ్ ఉద్యోగం అంటూ విమర్శలు**
**కోటి రూపాయల పరిహారం అందించాలంటూ గిరిజన సంఘాలు**
**ఎన్ని వదంతులు వచ్చిన కుటుంబానికి అండగా ఉంటాం అంటూ భరోసా!?**
**నియోజకవర్గంలోని ములకలపల్లి మండలంలో రెవెన్యూ శాఖ పర్యటన!**

**ప్రజా వాయిస్ అశ్వారావుపేట**
నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టి ఐటిడిఏ పరిధిలోని జాబు మేళం లో పాల్గొని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్స్ గా ఉపాధి పొంది కుటుంబానికి అండగా నిలిచిన ఒకే శిరీష ఆగస్టు 29- 2026 హైదరాబాదులో అత్యాచారానికి గురై అతి క్రూరంగా హత్యకు గురైన సంఘటన యావత్తు రాష్ట్రాన్ని కలిసి వేసిన ఘటన తెలిసింది. ఇటువంటి గిరిజన మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దినసరి సీతక్క హామీ ఇవ్వటంతో ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను అందజేసే విధంగా కార్యచరణ రూపకల్పన చేయటం కొంత సంతోషకరమైనప్పటికీ పుట్టాడు లో ఉన్న గిరిజన



కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం తో పాటు కుటుంబ సభ్యులకు ఒకరికి పర్మెంటు ఉద్యోగం మరియు ఇందిరమ్మ గృహం కాకుండా స్వతాగా నిర్మించి ఇవ్వాలని జనతా పార్టీ బిజెపి మరియు గిరిజన సంఘాలు నాయకులు సైతం గళం ఎత్తుతున్న తగ్గేది లేదని శు క్రవారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగలేటి శ్రీనివాసరావు పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోనే ములకలపల్లి మండలంలోని చౌటుగూడెం గ్రామానికి వెళ్లి తల్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సవ్య సమాజం తలదించుకునే లాగా శిరీష హత్య జరగటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ మృగం చేతిలో గిరిజన యువతి హత్య కావటం దురదృష్టకరమైన సంఘటనని ఓ గిరిజన మహిళ హైదరాబాద్ వెళ్లి ఔట్సోర్సింగ్ వీధిలో స్టాఫ్ నర్స్ గా పని చేస్తున్న సందర్భంలో మహా నగరానికి చెందిన ఒక వ్యక్తి అత్యాచారం జరిపి హత్య చేసిన ఘటనలో కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని కుటుంబానికి తీరని లోటు ఉందని తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు వారన్నారు అంతే కాకుండా మృతురాల తల్లి, అన్నా, వదిన. కుటుంబ సభ్యులతో మాట్లాడి నిందితుడికి కఠినంగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని తప్పక న్యాయం చేసేలాగా రాష్ట్ర ప్రభుత్వం తరపున హామీ ఇవ్వటమే కాకుండా ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ మరియు 5 లక్షల రూపాయల చెక్కును అందించడం జరిగింది. ఇదిలా ఉంటే బిజెపి మరియు గిరిజన సంఘాల నాయకులు గిరిజన మహిళా అయినా ఒకే శిరీష ప్రభుత్వం తరపునుండి ప్రైవేట్ వైద్యశాలకు స్టాఫ్ నర్స్ గా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో సిబ్బంది నిర్లక్ష్య వైకార్యాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబీకులకు ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని అలాగే కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వం నుండి పరమెంటు ఉద్యోగాన్ని ఇచ్చే విధంగా విధివిధానాలను ఏర్పాటు చేయాలని ఇందిరమ్మ ఇల్లు కాకుండా స్వతాగా గృహాన్ని నిర్మించి అందించాలని ప్రభుత్వం పూర్తిగా భరోసా ఇవ్వాలని అధికార పార్టీ పార్టీ గద్దెనెక్కటం కోసం అనేక ఉచిత హామీలు ఇవ్వడం జరిగిందని నేటికీ వాటిని విస్మరించడం జరిగిందని ఇటువంటి విధానాన్ని మానుకొని తక్షణమే శిరీష కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించే విధంగా కార్యచరణ రూపకల్పన చేయాలని బిజెపి జిల్లా నాయకులు కంబల్ల రవికుమార్ ప్రభుత్వాన్ని చేస్తున్న జిల్లాలోని మంత్రివర్యులు మాత్రం పర్యటనలో భాగంగా ములకలపల్లి మండలంలోని చౌటుగూడెం సందర్శించి బాయితరాల కుటుంబానికి ప్రభుత్వం నుండి నష్టపరిహారాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు పినపాక ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు జారే ఆదినారాయణ ఇల్లంద ఎమ్మెల్యే కారం కనకయ్య స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన్ రాహుల్ హౌసింగ్ పీడీ సవాయ్ రామ్

# మహిళా సంఘాలకు గోదాంలు, ప్రాసెసింగ్ యూనిట్లు

## దోమకొండలో స్థలపరిశీలన చేసిన ఇక్రిశాట్ శాస్త్రవేత్త

**ప్రజావాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 4:**
మహిళా రైతులకు పంటల నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి వారి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా దోమకొండ మండలంలో వ్యవసాయ గోదాంలు, మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఐకెపి, డీ ఆర్ డి ఏ, ఇక్రిశాట్ అధికారులు , శాస్త్రవేత్తలు శుక్రవారం స్థలాలను పరిశీలించారు.హైదరాబాద్ నుంచి వచ్చిన ఇక్రిశాట్ శాస్త్రవేత్త హర్షవర్ధన్ ఐకేపీ సిబ్బందితో కలిసి ప్రతిపాదిత రెండు యూనిట్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునే



సదుపాయం ఉంటే మార్కెట్ ధరలు అనుకూలంగా ఉన్న సమయంలో విక్రయించి మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.రైతు పండించిన విత్తనాలను పంట ఉత్పత్తులను శుద్ధి చేసి, ప్రాసెసింగ్, ప్యాకింగ్ అనంతరం మార్కెటింగ్ చేసే విధంగా మహిళా సంఘాలను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.మండలంలో ప్రతిపాదించిన రెండు యూనిట్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. యూనిట్లు అందుబాటులోకి వస్తే పంటల నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ రంగాల్లో మహిళా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్, ఇక్రిశాట్ కోఆర్డినేటర్లు లక్ష్మీకాంత్, యశ్వంత్, జీపీవో అశోక్, ఏపీఎం శ్రీనివాస్, ఎఫ్‌పీసీ సీఈవో రవికుమార్, వీఓఏ హేమలత తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ బస్సును ప్రారంభించిన సర్పంచ్‌లు జైపాల్ నాయక్,కవిత-సేనాపతి

**ప్రజా వాయిస్ పుల్కాల్ (సంగారెడ్డి ):**
వివిధ పనులు, చదువుల నిమిత్తం పాఠశాల, కళాశాలలకు, ఉద్యోగరీత్యా ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్న విషయాన్ని గమనించి, గ్రామపంచాయతీ పాలకవర్గం తరపున ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.వినతిపై స్పందించిన ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలు బొమ్మరెడ్డిగూడెం, ఇతర తండాల ప్రజల అవసరాల నిమిత్తం బస్సు సౌకర్యాన్ని కల్పించినందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. చౌటకూర్ మండలం బొమ్మరెడ్డిగూడెం గ్రామానికి, పుల్కల్ మండలంలోని హన్య నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సంగ్య నాయక్ తండా, తావుర్య తండా, విట్టల్ నాయక్ తండా, లాల్ సింగ్ నాయక్ తండా, లక్ష్మీసాగర్, ఉమ్లా తండా, కొండారెడ్డిపల్లి గ్రామం, తండా, పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజల అవసరాల నిమిత్తం శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా జోగిపేట నుంచి వయా లక్ష్మీసాగర్, బొమ్మరెడ్డిగూడెం మీదుగా సంగారెడ్డికి, అలాగే సంగారెడ్డి నుంచి వయా చౌటకూర్, బొమ్మరెడ్డిగూడెం, లక్ష్మీసాగర్ మీదుగా జోగిపేటకు ఉదయం, సాయంత్రం వేళల్లో వెళ్లే ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.శుక్రవారం బస్సుకు పూజలు నిర్వహించి, బస్సు ప్రారంభోత్సవాన్ని బొమ్మరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్, హన్య నాయక్ తండా సర్పంచ్ కవిత సేనాపతిలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజనీ గోపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు, విశ్రాంత వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గోవిందరావు, ఎక్సైజ్ గోపాల్, మాజీ సర్పంచ్ మమతా రఘునాయక్, వార్డు సభ్యులు సుభాష్, నీలాబాయి, రాజు, గణపతి నాయక్, రవీందర్ నాయక్, శంకర్ నాయక్, హన్య నాయక్, మోతిలాల్, దశరథ్, మాజీ సర్పంచ్ శివరాం, రంగారావు, హరిసింగ్, జెల్‌సింగ్, నందులాల్, సర్వన్ నాయక్, కుమ్మరి రాజు, బొమ్మరాజు, శ్రీనివాస్, ప్రవీణ్, శివ, మేగవత్ రాములు, బైరు ప్రవీణ్, జీవవైవిధ్య కమిటీ సభ్యులు సంతోష్, శివ, బాలమణి, ఆనంద్, ప్రవీణ్, కిషన్, కిష్టయ్య, రాజు, అకేష్, విజయ్, ఆంజనేయులు, సతీష్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.



# కడవెండి గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరిపించాలి

**లబ్ధిదారులు ఎంపికలో గ్రామస్థాయిలో సరైన విచారణ చేయాలి**


**ఎంపికైన ప్రతి లబ్ధిదారుడి ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**ఇప్పటికే సొంత ఇల్లు ఉందా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలి**

**కడవెండి గ్రామ ప్రజల డిమాండ్**

**ప్రజా వాయిస్/దేవుడుప్పుల సెప్టెంబర్: 04**

కడవెండి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై గ్రామ ప్రజల్లో అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో గ్రామస్థాయిలో సరైన విచారణ, క్షేత్రస్థాయి పరిశీలన, అర్హతల నిర్ధారణ పూర్తిస్థాయిలో జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కొంతమంది వ్యక్తులు అందించిన సమాచారాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని, సంబంధిత కుటుంబాల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లయితే, అది నిజమైన పేదలు మరియు అర్హులైన కుటుంబాలకు అన్యాయం జరిగే పరిస్థితికి దారితీస్తుంది.ప్రత్యేకంగా ఇప్పటికే సొంతంగా నివాస గృహాలు కలిగి ఉన్న వ్యక్తులు కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో ఉన్నారనే అభ్యంతరాలు గ్రామస్థుల నుండి వస్తున్నాయి. అదే సమయంలో నిజంగా ఇల్లు లేని, ఆర్థికంగా వెనుకబడిన మరియు ప్రభుత్వ పథకానికి అర్హత కలిగిన కుటుంబాలకు ఇళ్లు దక్కలేదనే ఆవేదన కూడా వ్యక్తమవుతోంది.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రధాన ఉద్దేశ్యం నిజమైన అర్హులకు ప్రయోజనం అందించడం. కాబట్టి కులం, వ్యక్తిగత పరిచయాలు, రాజకీయ లేదా ఇతర ప్రభావాలకు అతీతంగా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు మరియు అర్హత ప్రమాణాల ప్రకారం మాత్రమే లబ్ధిదారుల ఎంపిక జరగాలి.

**మా ప్రధాన డిమాండ్లు:**

1.కడవెండి గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై స్వతంత్రంగా మరియు నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ నిర్వహించాలి.

2.ఎంపికైన ప్రతి లబ్ధిదారుడి ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారికి ఇప్పటికే సొంత ఇల్లు ఉందా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలి.


3.లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన అర్హత ప్రమాణాలు, సర్వే వివరాలు మరియు ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా పరిశీలించాలి.

4.అర్హత లేని వ్యక్తులు ఎంపికైనట్లు విచారణలో తేలితే, వారి ఎంపికను నిబంధనల ప్రకారం పునఃపరిశీలించాలి.

5.నిజంగా ఇల్లు లేని, నిరుపేద మరియు అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి వారికి న్యాయం చేయాలి.

6.ఆజ, , దీజ మరియు ఇతర వర్గాలకు చెందిన అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సముచిత ప్రాతినిధ్యం మరియు న్యాయం జరిగేలా చూడాలి.

7.గ్రామస్థుల అభ్యంతరాలను స్వీకరించి, అవసరమైతే




గ్రామస్థాయిలో బహిరంగ విచారణ నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఖరారు చేయాలి.

**ప్రభుత్వానికి విజ్ఞప్తి**

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అనేది పేద కుటుంబానికి కేవలం ఒక భవనం కాదు-ఒక కుటుంబానికి భద్రత, గౌరవం మరియు భవిష్యత్తు. అందువల్ల అర్హత లేని వారికి కాకుండా, నిజంగా అవసరం ఉన్న కుటుంబాలకు ఈ ప్రభుత్వ పథకం ప్రయోజనం అందేలా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నాము.కడవెండి గ్రామ ప్రజలలో నెలకొన్న అనుమానాలు మరియు అభ్యంతరాలను నివృత్తి చేయడానికి సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాము.పారదర్శకమైన ఎంపిక అర్హులకు న్యాయం ప్రభుత్వ పథకాల సద్వినియోగం" అనే లక్ష్యంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.



## వాంకిడిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ నియోజకవర్గం వాంకిడి మండలంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా శ్యామ్ నాయక్ పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు బంగాజీ, వాంకిడి మండల ఉపసర్పంచ్ దీపక్ ముండే, మాజీ సింగిల్ విండో చైర్మన్ దాదాజీ, టౌన్ ప్రెసిడెంట్ కాలేష్, సీనియర్ నాయకులు విజయ్, వెంకట్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## స్వప్న కాలనీలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు...

**ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న కాలనీవాసులు**

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని 12వ వార్డు స్వప్న కాలనీలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి రాకేష్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొనగా, మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఆస్వాదించారు. శ్రీకృష్ణుడి నామస్మరణతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పండుగను ప్రజలంతా ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి తిరుపతి, సుకుమార్, శంకర్, ముత్యాల శ్రీనివాస్, అన్వర్, నయీమ్, బండి శ్రీనివాస్, కుమార్, దామోదర్ రెడ్డి, సంజీవ్, వీర లక్ష్మయ్య లతో పాటు కాలనీవాసులు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

**కాకులమర్రి లక్ష్మణ్ బాబు.బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు.**

**హామీల లెక్క చెప్పే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా?**

**మంత్రి సీతక్క ఏటూరునాగారం ప్రజలకు సమాధానం చెప్పాలి**

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా; ఏటూరునాగారం మండలం:/**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆరోపించారు. కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసనలో భాగంగా శుక్రవారం ఏటూరునాగారంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఓడగూడెం నుంచి బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద వంటావార్పు నిర్వహించి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ.....కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినా ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, వివిధ డిక్లరేషన్ల పేరుతో ప్రజలను



ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు హామీలను విస్మరించిందని అన్నారు.

ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఎప్పుడు ఏర్పాటు చేస్తారో మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నూతన బస్టాండ్, ఆర్టీసీ డిపో నిర్మాణం, గోదావరి కరకట్ట, స్థానిక గిరిజన యువతకు ఉపాధి వంటి హామీల పరిస్థితి ఏమిటో వెల్లడించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. యూరియా కోసం రైతులు క్యూలలో నిలబడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

కమలాపూర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పిన మంత్రి సీతక్క అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. పోడు భూముల సమస్య, ఐటీడీఏ బలోపేతం, పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రూ.500కే వంటగ్యాస్ హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "విమర్శలు కాదు.. హామీల లెక్కలు చెప్పాలి" అని లక్ష్మణ్ బాబు అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ములుగు నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం "మాది జనతా గ్యారేజ్" అంటూ ముందుండి పోరాడతామని తెలిపారు. బీఆర్ఎస్ నిరసనకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ఏర్ల వెంకన్న ముదిరాజ్, పోరిక గోవింద్ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, మాజీ ఎంపిపి మస్రగాని వినయ్ కుమార్ యాదవ్, సర్పంచ్ ముడుతనపల్లి మోహన్, యలవర్తి శ్రీనివాస్, బాడిష నాగరమేష్, కోగిల మహేష్, గడదాసు సునీల్ కుమార్, కాకులమర్రి శ్రీలత, ఎండి వలీ బాబా, కూనూరు అశోక్ గౌడ్, ఖాజా పాషా తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 104 ఉద్యోగులను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి:ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**పటాన్ చెరువు ప్రజా వాయిస్**

గత 18 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో నిస్వార్థంగా సేవలను ఇస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు రామచంద్రపురంలోని నివాసంలో 104 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.గత 18 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో నిస్వార్థంగా సేవలందిస్తున్న సుమారు 300 మంది 104 ఉద్యోగులను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు.డీఎంఈ పరిధిలో ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లుగా సేవలందిస్తున్న వీరిని నిబంధనల ప్రకారం జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేసినప్పటికీ, నేటికీ ఔట్‌సోర్సింగ్ విధానంలోనే కొనసాగిస్తూ వేతనాలు అందించడం బాధాకరం. ఏళ్ల తరబడి సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత,



కనీస వేతనాలు వంటి సమస్యలతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అర్హత కలిగి, ప్రభుత్వ ప్రక్రియ ద్వారా ఎంపికై, దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉద్యోగులను ఇంకా ఔట్‌సోర్సింగ్ విధానంలో కొనసాగించడం సరికాదు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్‌పై సానుకూలంగా స్పందిస్తూ, ఈ సమస్యను రాబోయే శాసనమండలి సమావేశాల్లో ప్రముఖంగా ప్రస్తావిస్తామని వారికి హామీ ఇచ్చాము. అలాగే ఈ అంశాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారి మరియు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారి దృష్టికి నేరుగా తీసుకువెళ్లి, 104 ఉద్యోగులందరికీ శాశ్వత ప్రాతిపదికన న్యాయం జరిగేలా ప్రభుత్వ స్థాయిలో పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చాము.104 ఉద్యోగుల సేవలకు గుర్తింపు, ఉద్యోగ భద్రత, న్యాయమైన హక్కులు కల్పించే దిశగా మా పోరాటం కొనసాగుతుంది.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కిరణ్ కుమార్, కల్పన, శివరాజ్, వినోద, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## వీపనగండ్లలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ప్రజా వాయిస్.. వనపర్తి**

వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జన్మాష్టమి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులను బాలకృష్ణుడు, రాధారాణి వేషధారణలో ముస్తాబు చేయడంతో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయాల్లో నిర్వహించిన భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను సైతం నిర్వహించారు. యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. గ్రామాల్లో భక్తి, ఉత్సాహం వెల్లివిరియడంతో జన్మాష్టమి వేడుకలు కన్నులపండువగా సాగాయి.

## చిలుకూరులో కృష్ణాష్టమి సందడి

**చిన్నా.. పెద్దా తేడా లేకుండా ఉట్టి కొట్టిన గ్రామస్థులు**

**గ్రామపంచాయతీ వద్ద ఘనంగా వేడుకలు**

**కేరింతలతో మార్మోగిన ప్రాంగణం**

**ప్రజా వాయిస్,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామపంచాయతీ వద్ద కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.చిన్నా.. పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉట్టి కొట్టేందుకు యువత, చిన్నారులు ఉత్సాహంగా పోటీపడటంతో గ్రామపంచాయతీ ప్రాంగణం సందడిగా మారింది. కేరింతలు, కృష్ణనామస్మరణల మధ్య ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామస్థులంతా కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

**ముత్తంగి జెడ్పీహెచ్ఎస్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం**

**రూ.80 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన**

**మరో 10 తరగతి గదుల నిర్మాణంతో పాటు పాఠశాల ప్రాంగణంలో సీసీ నిర్మాణం చేపడతాం**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరువు ప్రజావాయిస్**

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.ముత్తంగి డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓసాట్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో రూ.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ముత్తంగి ప్రాంతంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందేలా అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు.ప్రస్తుతం ఓసాట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్మిస్తున్న నాలుగు అదనపు తరగతి గదులతో పాటు మరో 10 తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో వర్షాకాలంలో బురద ఏర్పడకుండా అవసరమైన ప్రాంతాల్లో సీసీ నిర్మాణ పనులు చేపట్టి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నందున విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయ బృందంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ పాఠశాలలను కేవలం భవనాలుగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యవంతమైన తరగతి గదులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని స్పష్టం చేశారు.ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు కలిసి పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెంది విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటాయని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ రావు నాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీలు స్వప్న శ్రీనివాస్, ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఉపేందర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శరణ్యాన్, నరసింహ, మాధవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, కిట్టు, అండాలు, సందీప్, రామకృష్ణ, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## మాణిక్‌గూడలో కుడి కాలువ మరమ్మతుల్లో నిధుల దుర్వినియోగం ఆరోపణలు

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మాణిక్‌గూడ గ్రామంలో కుడి కాలువ మరమ్మతుల పేరుతో లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని సీపీఎం పార్టీ నాయకులు ఆరోపించారు. గ్రామంలో జరిగిన మరమ్మతు పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. అతి తక్కువ వర్షానికే కాలువ మట్టి, సీసీ రోడ్డు కొట్టుకుపోయాయని, ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. దీనివల్ల చిన్నారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.జరిగిన పనులపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి కాలువ మరమ్మతులకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు గుడిసెల కార్తీక్, రాజేందర్, అశోక్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## అలియాబాద్ లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన చామకూర మహేందర్ రెడ్డి

**శామీర్‌పేట / ప్రజా వాయిస్:**
స్వర్గీయ కీ.శే.బండి రాఘవరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి ప్రారంభించారు. బిఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ బండి రామిరెడ్డి, శ్రీకర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ లో అలియాబాద్ మున్సిపాలిటీ నుండి 18 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ రాఘవరెడ్డి అలియాబాద్ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, గ్రామ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. శనివారం జరిగే రాఘవరెడ్డి వర్ధంతి సందర్భంగా విజేతలకు నగదు బహుమతిని అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్, గూదె ఎల్లయ్య, మధుసూదన్ రెడ్డి, తాడెం కుమార్, వంగ వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### దోమకొండలో శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న కామారెడ్డి డి.ఎస్.పి

**ప్రజా వాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 4**
గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, సోదరభావంతో జరుపుకోవాలని కామారెడ్డి డి.ఎస్.పి మధుసూదన్ సూచించారు. దోమకొండ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దోమకొండ ఎస్ఐ ప్రభాకర్ అధ్యక్షత వహించారు. కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, బిక్కనూర్ సీఐ నరేష్ హాజరయి ఏలాంటి అల్లర్లు లేకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని గణేష్ మండలాల నిర్వాహకులకు కమిటీ బాధ్యులకు సూచించారు.ఈ సందర్భంగా కామారెడ్డి డిఎస్పీ బికనూరు సిఐ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవం భక్తితో జరుపుకోవాలి నిమజ్జనం ప్రతి ఒక్కరి భద్రతతో జరగాలని సూచించారు. ఊరేగింపు, నిమజ్జనం సమయంలో విద్యుత్ ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, ట్రాఫిక్ సమస్యలు వంటి ఘటనలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.పండుగ మన ఆనందం కోసం ఒక్క చిన్న నిర్లక్ష్యం ఆ ఆనందాన్ని విషాదంగా మార్చకూడదని అధికారులు సూచించారు. పోలీస్ శాఖ, ఉత్సవ కమిటీలు, గ్రామ పెద్దలు, ప్రజలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సూచనలు, అభిప్రాయాలను అధికారులు స్వీకరించారు.



# ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి

**ప్రజా వాయిస్,మోత్కూరు(సెప్టెంబరు4):**
ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరు మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభలు ఈనెల 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరుగుతున్న మహాసభల సందర్భంగా మోత్కూర్ లో ప్రచార జాతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు సంవత్సరానికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తానని నేటికీ 13 సంవత్సరాలు కావస్తున్న లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కనీసం రిటైర్మెంట్ అయిన స్థానాలలో కూడా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వకుండా,, మాట దాటవేస్తున్నారని యువతను నిర్వీర్యం చేస్తున్నారని ,నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్ల వెంట తిరుగుతున్నారని, ఉపాధి కోసం కార్పొరేషన్ల ద్వారా అవకాశాలు కల్పించాలని విద్యా, వైద్యం, ఉపాధి, హక్కుల కోసం పోరాడాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . ఈనెల 8నయాదగిరిగుట్టలో జరుగు యువజన భారీ బహిరంగ సభను పార్టీలకతీతంగా యువజన సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుల్ల శేఖర్ రెడ్డి ,మోత్కూరు మండలం ఏఐవైఎఫ్ అధ్యక్షుడు చిప్పలపల్లి ప్రశాంత్ ,ఎడ్ల ఆనంద్, జంగలింగం ,సిపిఐ మోత్కూర్ మండల కార్యదర్శి అన్నెపు



వెంకట్ ,మండల సహాయ కార్యదర్శి పుల్కరం మల్లేష్. ప్రజానాట్యం మండలిజిల్లా అధ్యక్షుడు ,బుష్పక నరసింహ, డిహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి జిట రాములు, ఎఐటియుసి మండల కార్యదర్శి తొంట తిరుపతి. పెండెం వెంకటేశ్వర్లు, గొలుసులు యాదగిరి, కడమంచి వీరస్వామి, తాడూరు లక్ష్మీ నరసయ్య, గంగాదేవి చంద్రయ్య. తదితరులు పాల్గొన్నారు

# గురకను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే

### స్లీప్ అప్నియాపై అవగాహన సదస్సు

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్, సెప్టెంబర్ 4**
నిద్రలేమి, అధిక గురక, స్లీప్ అప్నియా వంటి సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎండీఆర్ హైస్కూల్ ప్రాంగణంలో ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చరమంద రాజు, ఎండీఆర్ విద్యా సంస్థల చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేష్ మేరెడ్డి మాట్లాడుతూ.. నిద్రలో గురక రావడాన్ని సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. నిరంతరం అధికంగా గురక రావడం, నిద్రలో శ్వాసకు అంతరాయం కలగడం వంటి లక్షణాలు స్లీప్ అప్నియాకు సంకేతాలు కావచ్చని తెలిపారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, పలు శ్వాసకోశ మరియు గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు.గురక, నిద్రలేమి సమస్యలకు కారణాలు, వాటిని గుర్తించే విధానం, ఆధునిక వైద్య చికిత్సా పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ సురేష్ మేరెడ్డి సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా గురకతో బాధపడుతున్న వారు వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా గురక, నిద్రలేమి, స్లీప్ అప్నియా సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల కార్యక్రమానికి హాజరైన వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు



మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని అన్నారు.

# రాష్ట్ర సదస్సులను జయప్రదం చేయండి..

### రైతు కూలి సంఘం 9వ మహాసభలు..

### అఖిల భారత రైతు కూలి సంఘం.

**ప్రజా వాయిస్, బయ్యారం..**
సెప్టెంబర్ 8 -9 తేదీలలో మంచిర్యాల లో జరుగు అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ 9 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బయ్యారం మండలంలో వెంకట్రాంపురం బాలాజీ పేట,గౌరారం,లక్ష్మీ నరసింహ పురం, గ్రామాలలో మహాసభల పోస్టర్స్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ.కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా,రైతాంగం వ్యవసాయ కూలీలు సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.గత 50 సంవత్సరాల పైగా అఖిల భారత రైతు కూలి సంఘం భూమి కోసం,వ్యవసాయ కూలీల సమస్యల సాధన కోసం పోరాడుతూ, భూస్వాముల పెత్తందారుల ఆగడాలు దౌర్జన్యాలను ఎదిరించి పోరాడిందని, గోదావరిలోయ పరివాహక ప్రాంతంలో సంఘ నాయకత్వను ఆదివాసీలు ఇతర పేదలు లక్షలాది ఎకరాల ఫారెస్ట్ బంజర భూములను సాధించుకున్నారని వారన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు వారితో సహజనం చేస్తున్న ప్రజల పోరాటాల ఫలితంగా 1/70 చట్టం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ 2026 లో అటవీ హక్కుల చట్టం లాంటి చట్టాలను పాలకవర్గాల మెడలు వంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టా హక్కులు చాలా వరకు సాధించుకున్నారని వారు పేర్కొన్నారు కేంద్ర,రాష్ట్ర



ప్రభుత్వాలు నేడు అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం,జీవించే హక్కును కాపాడుకోవడం కోసం పెల్లిబిక్కిన పోరాటాలలో ఎందరో వీరులు నాటి దొడ్డి కొమురయ్య నుండి నేటి లింగన్న వరకు ఆణిముత్యా లాంటివారు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారు. ఆ పోరాట వారసత్వ నేపథ్యానికి కొనసాగింపుగా నే దున్నే వాడికి భూమి దక్కాలని భూస్వాముల భూములు పంచాలని దోపిడీ లేని సమాజాన్ని నిర్మాణం చేయడం కోసం.అఖిల భారత రైతు కూలీ సంఘం పోరాడుతుందని తెలియజేశారు.కేంద్ర ప్రభుత్వం స్వదేశీ,విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతాంగానికి శ్రమజీవులకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న విధానాల వల్ల దేశంలో పేదరికం అసమానతలు వేగంగా పెరుగుతున్నాయని విదేశీ కార్పొరేట్ శక్తులు దేశంగా ఉన్న అన్ని రంగాలను కైవసం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నాయి చిన్నచిన్న కమతాలు కాదాపు నూటికి 90% గా ఉన్న భారత రైతంగాన్ని వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించే కుట్రలో భాగంగానే. విత్తన చట్టం.విద్యుత్ సవరణ చట్టం తోపాటు అమెరికా బ్రిటన్, న్యూజిలాండ్,యూరోపియన్



యూనియన్లతో మోడీ ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకున్నది భారత వ్యవసాయ రంగంలోకి 32 దేశాల నుండి దిగుమతులకు అవకాశం కల్పించిందని దీనివలన భారత వ్యవసాయ రంగం రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. 2021 డిసెంబర్ 9వ తేదీన ప్రధానమంత్రి మోడీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీల ను అమలు చేయాలని,రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ గ్యారంటీ చట్టం చేయాలని, రైతులకు రుణ విముక్తి చట్టం చేయాలని,స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ,పోరాడుతున్న అఖిలభరత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రైతాంగానికి. ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోకల వెంకన్న జిల్లా నాయకులుచింత వెంకన్న.గుండెబోయిన లింగమల్లు,మింగు భగవాన్,నూనె లింగయ్య, దేశెట్టి రవి, నిమ్మరబోయిన సహదేవ్,గుడి బోయిన రమేష్,కొత్త రామదాసు,బొల్లం సోమక్క నందగిరి సత్యం,వల్లాల బిక్షం అజ్మీర రాజు,బిక్షం రాంజీ తదితరులు పాల్గొన్నారు..

# సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

### మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన గ్యారంటీ హామీలు ఎక్కడా పాయె..

### కాంగ్రెస్ దగా పాలనకు వంటా వార్పుతో బిఆర్ఎస్ శ్రేణులు నిరసన..

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో కాంగ్రెస్ 1000 వెయ్యి రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని లైఫ్ స్టైల్ కాంప్లెక్స్ మోర్ సూపర్ మార్కెట్ వద్ద శుక్రవారం నాడు కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అదేవిధంగా మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు వారం రోజుల పాటు బిఆర్ఎస్ శ్రేణులు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు,వృద్ధులకు,దివ్యగుంలకు ఇచ్చిన గ్యారెంటీలను విస్మరించడానికి నిరసిస్తూ మహిళా నాయకురాలు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. అదేవిధంగా మహిళలు,వృద్ధులు, వికలాంగులు,బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే మాణిక్ రావు పాల్గొని, అనంతరం





ఆయన మాట్లాడుతూ, మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి, మోసపూరిత తనాన్ని ఎండగట్టారు.అధికారమే లక్ష్యంగా సాధ్యం కాని హామీలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ మహిళలకు ఇచ్చిన గ్యారంటీలను విస్మరించి మహిళా లోకాన్ని మోసం చేసిందని,మహిళలకు నెలకు రూ.2500 రూపాయలు, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని చెప్పి నమ్మించి మహిళలను మోసం చేశారు.మహిళలకు ఇస్తామన్న గ్యారెంటీలను విస్మరించడమే కాక వృద్ధులకు ఇస్తామన్నా 4000/- పెన్షన్, వికలాంగులకు ఇస్తామన్న 6000/- పెన్షన్ ఏమైందని ప్రశ్నించారు.మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మహిళలు బొంద పెట్టడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఆయా మండలాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా పాలనలో సంక్షేమానికి పెద్దపీట

**కాంగ్రెస్ వెయ్యి రోజుల విజయోత్సవ బైక్ ర్యాలీ..**

**నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు..**





**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా,సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సుభాష్ గంజ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి జాతీయ మెయిన్ రోడ్ రహదారి గుండా ప్రారంభించి భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబెడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి అక్కడి నుండి కుమార్ హోటల్ మీదుగా కరెంట్ ఆఫీస్ వరకు మాజీ మంత్రి జహీరాబాద్ ఇంచార్జ్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు మరింత ఉత్సాహాన్ని నింపిందని అన్నారు.అనంతరం ఈ ర్యాలీని ఉద్దేశించి నియోజకవర్గ ఇంచార్జ్, మరియు కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 వెయ్యి రోజులలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరా మహిళ శక్తి ద్వారా డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ పంపు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తు వస్తున్నారు,ఇంకా రాబోయే రోజుల్లో కూడా రాష్ట్ర ప్రజలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.అంతేకాకుండా ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సుపరిపాలనను ప్రతిబింబించేలా ఈ ర్యాలీ ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్,మండల అధ్యక్షుడు హుగ్గెల్లి రాములు, అదేవిధంగా తాజా మాజీ మండల పట్టణ అధ్యక్షులు ,కౌన్సిలర్లు, సర్పంచులు,మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# విధ్వంసానికి చిరునామా రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలన..

**నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన మహోన్నత వ్యక్తి కేసీఆర్..**

**నిరుపేదల సంక్షేమ పథకాలను నిలిపివేశారు..**

**నోటీసుల పేరుతో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను నరకయాతనకు గురి చేస్తున్నారు..**

**వచ్చేది మన ప్రభుత్వమే.. అన్ని సంక్షేమ పథకాలను అందిస్తాం..**

**నీటి బిల్లుల మాఫీకి కృషి**

**అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉంటాం**

**అవసరమైన సమయంలో మీ శక్తిని చూపించండి..**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో బిఆర్ఎస్ నిరసన గళం**





**పటాన్ చెరువు ప్రజావాయిస్**
ప్రజలు నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం అందిస్తే.. పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ విధ్వంస పాలన కొనసాగిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ 420 మోసాల పైన బిఆర్ఎస్ పార్టీ పోరు బాటలో భాగంగా.. శుక్రవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు కేసీఆర్ నగర్ డబల్ బెడ్రూమ్స్ ఫేస్ టూ లో తాగునీరు, విద్యుత్, బస్తీ దవాఖానాల అంశంపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..పటాన్చెరు నియోజకవర్గంలో సుమారు 38 వేల డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం జరిగిందని, పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించేందుకు సుమారు 600 ఎకరాల భూమిని అందించి, కేవలం మూడేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు.పేదల సొంతింటి కలను సాకారం చేయడం ఆషామాషీ వ్యవహారం కాదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం వినూత్న పథకాలను ప్రవేశపడితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**నోటీసుల పేరుతో వేధిస్తే సహించేది లేదు**

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు నోటీసుల పేరుతో ఇబ్బందులు కలిగించడం, కొత్తగా వచ్చిన అధికారులు లేదా సిబ్బంది పేరుతో వేధింపులకు గురిచేయడం సరికాదని ఎమ్మెల్యే జిఎంఆర్ హెచ్చరించారు.అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలబడతామని, అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉండే మీ కుటుంబ సభ్యుడిగా తాను ఉంటానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

**నీటి బిల్లుల మాఫీకి కృషి**

కొల్లూరు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం సముదాయంలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు నీటి బిల్లుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీలో అవసరమైన కొత్త డ్రైనేజీ వ్యవస్థ, ఎస్‌టీపీ (స్యూ) పనులకు సంబంధించిన ప్రణాళికలను పునరుద్ధరించి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అతి త్వరలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రతి బ్లాకులో పర్యటించి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తామని తెలిపారు.

**వచ్చేది మన ప్రభుత్వమే.. సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తాం..**

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించి ప్రజలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.మీ సొంత ఇంటి కలను సాకారం చేసిన కెసిఆర్ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని.. అవసరమైన సమయంలో మీ శక్తిని చూపించాలని కోరారు.పేదల సంక్షేమాన్ని విస్మరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.ఎలాంటి సమస్యలు ఉత్పనమైన తన దృష్టికి తీసుకుని రావాలని.. అర్ధరాత్రి ఫోన్ చేసినా తాను అందుబాటులో ఉంటానని చెప్పడంతో పాటు.. తన వ్యక్తిగత ఫోన్ నెంబర్ సైతం ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల మోసంపై రైతుల సమరభేరి - హుస్నాబాద్‌లో వంటావార్పు

**హామీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం - బోయినపల్లి వినోద్ కుమార్**

**రైతుల కన్నీళ్లకు కారణమైన ప్రభుత్వాన్ని వదిలిపెట్టం - వొడితల సతీష్ కుమార్**

**హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు**

**ప్రజా వాయిస్ హుస్నాబాద్,**
ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజుల పాలన పూర్తి చేసుకుంటున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేసిందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, రైతు వ్యతిరేక వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం హుస్నాబాద్ మండలం పందిళ్ల స్టేజి వద్ద రైతు సదస్సు, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులపై ప్రేమ ఒలకబోసిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా రోజుకో మాట చెబుతూ ప్రజలను మభ్యపెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు.రైతుబంధు, రైతుభరోసా, రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, సాగునీరు, ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు వంటి అంశాల్లో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు."ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావచ్చు.. కానీ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పాలన సాగించలేరు" అని బోయినపల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.హామీలన్నీ ఏమయ్యాయి? -- సతీష్ కుమార్వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలకు నెలకు ?2,500, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు తులం బంగారం, కేసీఆర్ కిట్, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను ఏమి చేశారో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు."ఎన్నికల ముందు హామీల వర్షం.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాటల మాయాజాలం. ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన?" అని ప్రశ్నించారు.రైతుల విషయంలోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే.. రుణమాఫీ, రైతుభరోసా, సాగునీరు, ఎరువులు, విత్తనాల విషయంలో స్పష్టత లేకుండా ప్రభుత్వం రైతులను అయోమయానికి గురిచేస్తోందని మండిపడ్డారు.గౌరవెల్లి ప్రాజెక్టు దాదాపు 99 శాతం పనులు పూర్తయినప్పటికీ, మిగిలిన పనులను పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సతీష్ కుమార్ ఆరోపించారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు."రైతు సంక్షేమం అంటే సభల్లో ప్రసంగాలు చేయడం కాదు.. రైతు పొలానికి నీరు, పంటకు ధర, రైతు చేతికి పెట్టుబడి అందించడం. రైతు కష్టాన్ని అర్థం చేసుకోని ప్రభుత్వం ఎంతకాలం అధికారంలో ఉన్నా ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకోలేదు" అని సతీష్ కుమార్ అన్నారు.

**ప్రజల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే బీఆర్ఎస్ ప్రజల తరపున మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడుతుందని నాయకులు హెచ్చరించారు. రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని స్పష్టం చేశారు."ఇది కేవలం వంటావార్పు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల నిరసనకు నాంది. ఇది రైతుల సమరభేరి. హామీలు అమలు చేసే వరకు, రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు" అని వొడితల సతీష్ కుమార్ తేల్చిచెప్పారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ టౌన్‌తో పాటు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, సైదాపూర్, చిగురుమామిడి, కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నినాదాలు చేశారు.






# నార్నూర్‌లో బీఆర్ఎస్ వంట వార్పు కార్యక్రమం

**కాంగ్రెస్ పాలనపై ఆగ్రహం**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
ఆసిఫాబాద్ నియోజకవర్గం నార్నూర్ మండల కేంద్రం గాంధీ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ వంట వార్పు నిర్వహించారు.మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల్లోనూ ప్రభుత్వం మోసం చేసిందని పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేష్ ఆరోపించారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సయ్యద్ కాశీం, మాజీ సర్పంచ్ ఉర్వత రూపదేవ్, కనక ప్రభాకర్, టౌన్ ప్రెసిడెంట్ ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు

**ఘనంగా కృష్ణ జన్మాష్టమి వేడుకలు**





**ప్రజా వాయిస్ భిక్కనూర్:**
భిక్కనూర్‌లోని స్నేహ పబ్లిక్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణుని జీవిత విశేషాలను, జన్మాష్టమి పండుగ ప్రాముఖ్యతను తెలియజేసే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల అందమైన వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ , కరస్పాండెంట్ సుబ్బారావు , అకడమిక్ ఇన్‌చార్జ్ ఎం.డి. సలీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన భక్తి భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల యాజమాన్యం తెలిపారు.చిన్నారుల చిరునవ్వులతో, శ్రీకృష్ణుని ఆశీస్సులతో జన్మాష్టమి వేడుకలు ఆనందోత్సాహాలమధ్య జరిగాయి.

# ముకుందా ...ముకుందా

**ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు వేడుకలు**

**ప్రజా వాయిస్ వేములపల్లి**
నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.కృష్ణాష్టమి సందర్భంగా పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. కార్యక్రమాలను తిలకించేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులను తల్లిదండ్రులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.పలు గ్రామాల్లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, భక్తి గీతాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాలల అభివృద్ధి, బోధనలో నూతన విధానాలు, విధి నిర్వహణలో అంకితభావాన్ని గుర్తించి ఎంపిక కమిటీ ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది.పురస్కారాలకు ఎంపికైన వారిలో సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం-×× ఎస్. రత్నాకర్ రెడ్డి, గర్రెపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ పి. వెంకటేశం, పెరుకపల్లి ఎంపీపీఎస్ ఎస్జీటీ ఎం. ముని కుమార్ ఉన్నారు.జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వీరు పురస్కారాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య ముగ్గురు ఉపాధ్యాయులను అభినందించి, వారి సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.





## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ఉపాధ్యాయుడు సంతోష్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి**

**రూ. 5,000 అందజేసిన పాఠశాల మాజీ కరస్పాండెంట్ సామ భూపాల్ రెడ్డి**

**మోటకొండూరు, సెప్టెంబరు 4(ప్రజా వాయిస్):-** మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో గల మానస విద్యా మందిర్ పాఠశాలలో 12 సంవత్సరాలుగా గణిత ఉపాధ్యాయుడిగా సేవలందించి, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నీర్నేముల సంతోష్ మృతి పట్ల పలువురు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల మాజీ కరస్పాండెంట్ శ్రీ సామ భూపాల్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా సంతోష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన కోరుకున్నారు. పాఠశాలకు సంతోష్ అందించిన సేవలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ తన వంతుగా రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## మృతుడి కుటుంబానికి ఆటో డ్రైవర్ల అండ

**బైరి గిరి కుటుంబానికి పది వేల ఆర్థిక సాయం**

**తోటి డ్రైవర్ కుటుంబానికి చేయూతనిచ్చిన జై శ్రీరామ్ ఆటో యూనియన్**

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం**
నల్గొండ జిల్లా,గుర్రంపోడు మండల పరిధిలోని పిట్టలగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ బైరి గిరి హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబానికి తోటి డ్రైవర్లు అండగా నిలిచారు. జై శ్రీరామ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులందరూ కలిసి గొప్ప మానవత్వాన్ని చాటుకుంటూ బాధిత కుటుంబానికి రూ. 10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.వృత్తిరీత్యా డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న బైరి గిరి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబం ఒక్కసారిగా పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ విషాదకర పరిస్థితులను గమనించిన జై శ్రీరామ్ ఆటో యూనియన్ సభ్యులు స్పందించారు. తోటి డ్రైవర్ కుటుంబం పట్ల తమ సామాజిక బాధ్యతను చాటుకుంటూ యూనియన్ సభ్యులంతా స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు.ఈ క్రమంలో సేకరించిన నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి, ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న తోటి డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవడానికి జై శ్రీరామ్ ఆటో యూనియన్ సభ్యులు చూపిన ఈ చొరవను గ్రామస్థులు, తోటి వాహనదారులు, స్థానికులు ప్రశంసించారు. ఈ సందర్భంగా గిరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**50 లక్షల తో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ప్రజా వాయిస్ కడ్తాల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలే అభివృద్ధిగా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, గ్రామ అభివృద్ధిలో భాగంగా హెచ్ఎండిఏ నిధులు రూ.50 లక్షలతో సిసి రోడ్డు మరియు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శుక్రవారం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి, హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.



మైసిగండి గ్రామంలో మంజూరైన రూ.50 లక్షల హెచ్,ఎం,డి,ఏ నిధులతో సి,సి రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కడ్తాల్ మండల నాయకులు, పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పలు వివాహ కార్యక్రమాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో మండల ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లే తెలంగా ఆహార భద్రతకు నిలువెత్తు నిదర్శనం!

**కీసర మండల రేషన్ డీలర్లకు ఘన సన్మానం,**

**రేషన్ డీలర్లు గ్రౌండ్ లెవల్ హీరోలు,**

**సామాజిక సేవా కార్యకర్తలు తుడుం శ్రీనివాస్, రాగుల రమేష్ ముదిరాజ్.**

**ప్రజావాయిస్, కీసర :** పండుగలు, సెలవులు లేకుండా అహర్నిశలు కృషి చేస్తూ లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పిస్తున్న రేషన్ డీలర్లు గ్రౌండ్ లెవల్ హీరోలు అని కీసర మండల సామాజిక సేవా కార్యకర్తలు కొనియాడారు.కీసర మండలంలో రేషన్ లబ్ధిదారులకు నిరంతరం బియ్యం, ఇతర ఆహార ధాన్యాలను సకాలంలో అందిస్తూ ప్రభుత్వ ఆహార భద్రతా పథకాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతం చేస్తున్న రేషన్ డీలర్ల సేవను గుర్తిస్తూ శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల సామాజిక సేవా కార్యకర్తలు తుడుం శ్రీనివాస్, రాగుల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ అధ్యక్షులు తటాకం వెంకటేష్ శర్మ, కుంటోళ్ల విజయచందర్, గండు లాలి యాదవ్ లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా




అధ్యక్షులు తటాకం వెంకటేష్ శర్మ మాట్లాడుతూ... "మా రేషన్ డీలర్ల సేవను ఇంతవరకు అధికారులు గానీ, నాయకులు గానీ గుర్తించలేదన్నారు. కీసర మండల సేవా కార్యకర్తలు మా సేవను గుర్తించడం చాలా సంతోషంగా ఉందని. లబ్ధిదారులకు సమయానికి బియ్యం సరఫరా చేయడమే మా లక్ష్యం" అని అన్నారు.ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం ఇతరత్రాలు ప్రజలకు రేషన్ డీలర్ ల పాత్ర కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో బుడిగ జగన్, చిలక ముత్యాలు ముదిరాజ్, పండుగ రాజలింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను కించపరిస్తే సహించేది లేదు

**- రాయపోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు**



**ప్రజా వాయిస్ దౌల్తాబాద్ సెప్టెంబరు 4:**
భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా 'అంబేడ్కర్ కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రచిస్తూ, సోషల్ మీడియా వేదికల ద్వారా ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాయపోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో పుస్తకంపై నిరసన వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పుట్ట రాజు మాట్లాడుతూ.. దేశ ప్రజలందరికీ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వాన్ని కల్పించిన రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు పొందారని అన్నారు. సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడి ఆలోచనలు, ఆశయాలపై ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాలు, సంస్థలు అధ్యయనం చేస్తున్నాయని పేర్కొన్నారు.అంబేడ్కర్ చరిత్రను వక్రీకరించేలా పుస్తకాలు రాయడం, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. హమారా ప్రసాద్ వ్యాఖ్యలు, పుస్తకంలోని అంశాలపై ప్రభుత్వం, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయ స్ఫూర్తిని అవమానించడమేనని అన్నారు.అంబేడ్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని పుట్ట రాజు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులు సొక్కం స్వామి, శ్రీనివాస్, భాస్కర్, నాగరాజు, నవీన్, భానుప్రసాద్, దేవరాజ్, చాణక్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## చదువు ఒక్కటే పేదరికం పోగొడుతుంది

**రెసిడెన్షియల్ పాఠశాలలో చదివి తల్లిదండ్రుల ఆశయాలను సాధించింది**

**ఎంబిబిఎస్ సీట్ సాధించిన దళిత విద్యార్థిని హర్షిత**

**ప్రజా వాయిస్ తలకొండపల్లి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి గ్రామానికి చెందిన దళిత విద్యార్థిని పెరుమాండ్ల రాజేందర్ జ్యోతి దంపతుల కూతురు పెరుమాండ్ల హర్షిత నీట్ పరీక్షల లో ఉత్తమ ఫలితాలు సాధించి ఎంబిబిఎస్ సీటును పొందారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల హర్షిత 5వ క్లాస్ నుంచి ఇంటర్మీడియట్ వరకు



ఇబ్రహీంపట్నంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ అనంతరం నీట్ పరీక్షలో 4005 మార్కులు సాధించి ఎంబిబిఎస్ సీట్ పొందారు. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ లో గల భాస్కర మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు పొందినట్లు తల్లిదండ్రులు రాజేందర్ జ్యోతులు తెలిపారు. దళిత వర్గానికి చెందిన తమ కుటుంబం అంబేద్కర్ చూపిన దారిలో నడిచి నా కూతురు సీటు పొందడం ఆనందం కలిగించిందని ఈ సందర్భంగా వారు తెలిపారు చదువు ఒక్కటే పేదల కన్నీటిని తుడుస్తుందని చదువుతోటే ఏదైనా సాధించవచ్చు అని పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీట్ సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు కుటుంబ సభ్యులు.



## వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

**ఆర్ గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది**

**ప్రజా వాయిస్ కడ్తాల్ :**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో శుక్రవారం మూడో రోజు వంటావార్పు కార్యక్రమం మండల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారాలు మాజీ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ విజితా రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి సారించడం లేదని అన్నారు. వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వంటావార్పు నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో చిన్నారుల సందడి

**శ్రీకృష్ణుడిగా హిమన్ను గోపికగా రిషికా**

**(ప్రజా వాయిస్ షాబాద్)** ఆకట్టుకునే వేషధారణ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రానికి చెందిన చిన్నారులు ఆధ్వర్య ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్నారు శ్రీకృష్ణుడి వేషంలో, హిమన్ను గోపిక వేషంలో రిషికా



అందరినీ అలరించారు చిలిపి నవ్వులతో బాలకృష్ణుడు చేతిలో వేణువుతో మురళీధరుడు గోపికల మనసు దోచిన గోపాలుడు వేణుగానంతో మురిసిన బృందావనం నందుడి ఇంట వెలసిన నందలాలుడు భక్తుల హృదయాల్లో కొలువైన జగన్నాథుడు కృష్ణుడి లోకం శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు



# ధర్మ పరిరక్షణకు ప్రతీక శ్రీకృష్ణుడు

## పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి.. నీలం మధు

**పటాన్ చెరువు రాజావాయిస్**
ధర్మ పరిరక్షణకు, సత్యానికి ప్రతీక శ్రీకృష్ణ పరమాత్ముడని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.శుక్రవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ తో పాటు పటాన్ చెరు పట్టణంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు దేవరాజ్ నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయల ప్రాంగణంలో శ్రీ కృష్ణ నామస్మరణలు, భజనలు, భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన జీవన విలువలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రేమ, సేవాభావం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించే పండుగలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు ఈ కార్యక్రమాలలో కౌన్సిలర్లు నారాయణదాసు, మన్నె రాఘవేంద్ర, సంపత్, సంగన్నగారి గోపాల్,సందీప్ గౌడ్, దస్తగిరి, నాయకులు రవి, శ్రీను, మెట్టు రాజు ,భరత్, అత్తర్ , సాయి, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి ఇంటి కి కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత 420 ఆమీల బాకీ కార్డు

## కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ "బాకీ కార్డు" ఉద్యమం
## రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్
## మునిసిపల్ చైర్మన్ జనార్ధన్

**ప్రజా వాయిస్ జిన్నారం**
జిన్నారం మునిసిపల్ లో అండూర్, సొలక్ పల్లి మరియు రాలకత్వ గ్రామాలలో కాంగ్రెస్ మోసపూరిత 420 ఆమీల బాకీ కార్డులను ఇంటి ఇంటి కి పంచడం జరుగుతుంది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అడ్డా గోలు ఆమిలతో అధికారం లో కి వచ్చి తెలంగాణ ప్రజల పాలిట శాపంగా మారిందని తెలిపారు ప్రభుత్వం ఇచ్చిన ఆమీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ , జిన్నారం మునిసిపల్ చైర్మన్ జనార్ధన్ , మండల పార్టీ అధ్యక్షులు నాయికోటి రాజేష్,కౌన్సిలర్స్ ప్రభాకర్ రెడ్డి, పరమేష్ రెడ్డి, పూజారి రాజు, అది రామక్రిష్ణ, నాగరాజు, విజయభాస్కర్ రెడ్డి, కదీర్,శివరాజ్,ఆంజనేయులు, రాజేష్ రెడ్డి, శాంత వర్మ రెడ్డి, కృష్ణ గౌడ్,రాజేష్ రెడ్డి,రాములు యాదవ్,దేవేందర్, శ్రీనివాస్ రెడ్డి,అంజి గౌడ్,రతన్, శ్రీశైలం, నవీన్,భాస్కర్, సాయి గౌడ్, సుభాష్,పోచయ్య, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్,కుమ్మరి భాస్కర్ గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు

# పాస్‌పోర్ట్ పోయి పోలీసులను ఆశ్రయించిన వ్యక్తి

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**
ఎల్కతుర్తి గ్రామానికి చెందిన గూడెల్లి నవీన్ కుమార్ (35) తండ్రి గూడేల్లి సంపత్ తన పాస్‌పోర్ట్ పోయి సరిగ్గా నెల రోజులు కావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.నవీన్ కుమార్ నెల రోజుల క్రితం ఎల్కతుర్తి మండల కేంద్రానికి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. వస్తువులు కొనుగోలు చేసుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో తన ఎడమవైపు జేబులో పాస్‌పోర్ట్ (నంబర్:=3138851)ఉంచుకున్నారు. ఇంటికి వెళ్లి చూసుకునే సరికి పాస్‌పోర్ట్ జేబులో కనిపించలేదు.దీంతో వెంటనే తాను వచ్చిన మార్గంలో తిరిగి వెళ్లి వెతికినా పాస్‌పోర్ట్ ఆచూకీ లభించలేదు. అప్పటి నుంచి నెల రోజులుగా పాస్‌పోర్ట్ కోసం




వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోయిన పాస్‌పోర్ట్ ఆచూకీ కనుగొని తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.



# ఎమ్మెల్యేను కలిసిన టీయూడబ్ల్యూజే-ఐజేయూ నూతన కార్యవర్గం

## జర్నలిస్టులకు అండగా ఉంటా.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హామీ

**పటాన్‌చెరు ప్రజా వాయిస్**
పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే–ఐజేయూ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు పత్తి నర్సింహా ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పత్తి నర్సింహా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సంఘం కార్యక్రమాలకు ఎమ్మెల్యే సహకారం ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్పందిస్తూ జర్నలిస్టులకు, టీయూడబ్ల్యూజే–ఐజేయూకు తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పర్చ శ్రీనాథ్, పటాన్చెరు నియోజకవర్గ సలహాదారులు కాశిపతి, సులేమాన్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కమిటీ భాద్యులు శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మాజిద్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు విట్టల్, రఘురాంరెడ్డి, రాజు, నాగేష్, జీవరత్నం, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, ప్రభాకర్, కోటెశ్, ఆర్గనిసింగ్ సెక్రటరీలు రాజు, వివేక్, శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్దు, శ్రీనివాస్, నాయుడు, పురుషోత్తం, సలీమ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణా..ఇద్దరి అరెస్టు

## 170 క్వింటాళ్ల బియ్యం తరలింపునకు యత్నం.. లారీ స్వాధీనం

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్, సెప్టెంబర్ 4**
రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, భారీ మొత్తంలో నిల్వ చేసి ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను హుజూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం మఠంపల్లి మండలం వరదవరాయంనిగూడెం గ్రామానికి చెందిన రేషన్ షాప్ డీలర్ షేక్ బాషా, రామచంద్రపురం గ్రామానికి చెందిన అంగోతు బాబు కలిసి హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెద్ద మొత్తంలో బియ్యాన్ని సేకరించి ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు



ప్రయత్నించినట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో సెప్టెంబర్ 2, 2026న మధ్యాహ్నం, ఆపీ24డీ3479 నంబర్ గల లారీలో 340 బస్తాల్లో 170 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తుండగా హుజూర్‌నగర్ సివిల్ సప్లై ఆర్ఐ గిరి ప్రసాద్ గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. అనంతరం ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా హుజూర్‌నగర్ ఎస్ఐ సీహెచ్ నరేష్ ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు, నిల్వ, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పండగ

## 5 డివిజన్ లలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ,
## సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబుకు పూల అభిషేకం
## రాబోయే 10 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది
## డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్.

**ప్రజావాయిస్, కీసర :** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని నాగారం, దమ్మాయిగూడ, కీసర, చంద్రపురి కాలనీ, జవహర్ నగర్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కీసర రాంపల్లి చౌరస్తా నుంచి జవహర్ నగర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం నాగారం డివిజన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూల అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథిగా మేడ్చల్––మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత కరెంట్, ఫ్రీ బస్, ఇస్తున్నామని అన్నారు. పది సంవత్సరాలు గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు అన్నారు. మన ప్రజాప్రభుత్వం లో రాష్ట్ర ప్రజలకు రేషన్ కార్డులు అందించి, సన్నబియ్యం ఇచ్చిన ఇస్తున్న ఘనత మన ప్రభుత్వం మన ముఖ్యమంత్రి ఏ అని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు సంక్షేమం ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. పది ఏండ్లలో కేసీఆర్ ప్రజలను మోసం చేసి కాలయాపన చేసి, తన కుటుంబ సభ్యులకు మాత్రమే న్యాయం చేసుకున్నారని, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు వజ్రేస్ యాదవ్ అన్నారు. ఈ 1000 రోజుల ప్రజా ప్రభుత్వ బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు....



# మిన్నంటిన కృష్ణాష్టమి సంబరాలు

## ఉత్సాహంగా సాగిన ఉట్ల వేడుకలు

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్థానిక చౌరస్తాలోని శ్రీ రామాలయంలో స్వామివారికి యాదవ సంఘం నాయకులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ వేడుకలను స్థానిక ఎస్సై సీతా పాండు, సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఉట్ల పండుగలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పోటీపడి ఉట్లు కొట్టారు. చిన్నారుల గోపికలు, కృష్ణుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షులు బచ్చనగోని గాలయ్య యాదవ్, ఉపాధ్యక్షులు ఉబ్బు బాలరాజు, కార్యదర్శి కడారి మల్లేష్, డైరెక్టర్లు ఎడ్ల సత్తయ్య, సోమనబోయిన ఐలయ్య, జక్కల వెంకటేష్, గవ్వల జంగయ్యలతో పాటు యాదవ సంఘం కుల పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# షాబాద్ వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**(ప్రజా వాయిస్ షాబాద్)**
షాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జన్మాష్టమిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, శ్రీకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులు భజనలు చేస్తూ శ్రీకృష్ణుని నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని





మార్మోగించారు.ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి అనుగ్రహంతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. పండుగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మణెమ్మ, గ్రామస్థులు లంబడి కిరణ్ , తమ్మలి గౌతమ్, రవీందర్, నారాయణ, సత్యం, వినయ్, శివ, వసంత్, ఆకాష్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా వంట-వార్పు...

## పాల్గొన్నా మాజీ ఎమ్మెల్యే బానోత్ హరి ప్రియ.. జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు..





**ప్రజా వాయిస్,బయ్యారం..**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాత గణేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారంటూ మహిళా నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై వంట - వార్పు, కార్యక్రమం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా హరిసింగ్ నాయక్, మరియు మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదని వారు మండిపడ్డారు. కాబోయే రోజుల్లో కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో,తెలంగాణ ఉద్యమకారులు రాజేందర్ దిండిగల, ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్ నాయక్, జిల్లా నాయకులు శ్రీకాంత్ నాయక్, మండల పరిధిలోని మండల నాయకులు మహిళా నాయకులు,యూత్ నాయకులు, సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....